సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 30.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 300
పేజీలు: 08 వెల: రూ. 5

## ఇద్దరి హత్య

### వేప చెట్టుకోసం 25ఏళ్లుగా గొడవ

- తండ్రి, ప్రత్యర్థి హతం
- 25 ఏళ్ల పాత గొడవకు విషాదాంతం..

03



## సజ్జల నన్ను కొట్టాడు

### జగన్ సైలెంట్‌గా ఉన్నాడు



- జగన్ ఓటమికి సజ్జలే కారణం!
- వైసీపీపై తీవ్ర విమర్శలు
- విజయసాయి సంచలన ఆరోపణలు

02

## హరీష్ రావే



# టార్గెట్

## కవిత మాస్టర్‌ప్లాన్

- హరీష్‌పై అటాక్ వెనుక అసలు వ్యూహం ఇదేనా?
- బీఆర్ఎస్‌లో హరీష్ ప్రాబల్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యమా?
- అపనమ్మకం పెంచి.. పార్టీ నుంచి బయటకు పంపే వ్యూహమా?
- హరీష్ సైడిలైతే.. తెలంగాణ రక్షణ సేనకు లాభమేంటి?
- హరీష్ మౌనానికి కారణమేంటి?
- బీఆర్ఎస్‌లో చీలికకు కవిత ప్లానా?
- కవిత వర్సెస్ హరీష్ తో బీఆర్ఎస్ లో హీట్



**ముద్ర, హైదరాబాద్:**
బీఆర్ఎస్‌కు దూరమై తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. తన రాజకీయ అస్త్రాలను మాజీ మంత్రి హరీష్‌రావుపైనే గురిపెట్టడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. కేసీఆర్ ఆరోగ్యంపై, హరీష్‌రావు పాత్రపై కవిత చేసిన సంచలన ఆరోపణలు వ్యక్తిగత విమర్శల స్థాయిని దాటి రాజకీయ పోరుగా మారాయి.

**హరీష్ పై అపనమ్మకమే లక్ష్యమా?**

బీఆర్ఎస్ క్యాడర్‌తో పాటు కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్‌రావుపై అపనమ్మకం పెంచడమే కవిత వ్యూహంగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన అరెస్టు, ఆ తర్వాత పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి పరిణామాల వెనుక హరీష్‌రావు పాత్ర ఉందనే అభిప్రాయాన్ని కవిత బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. దీంతో హరీష్‌ను పార్టీ లోపలే రాజకీయంగా ఒంటరి చేయాలన్న ప్రయత్నమా అనే ప్రశ్నలున్నాయి.

**హరీష్ బయటకు వస్తే లాభమేంటి?**

కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్ క్యాడర్‌లో గట్టి పట్టు ఉన్న నేతగా హరీష్ రావుకు ఉన్న గుర్తింపు తెలిసిందే. ఆయన పార్టీకి దూరమైతే బీఆర్ఎస్ బలహీనపడే అవకాశం ఉంది. అదే సమయంలో అసంతృప్త నేతలు, క్యాడర్‌కు తెలంగాణ రక్షణ సేన ప్రత్యామ్నాయ వేదికగా ఎదగవచ్చనే అంచనాలున్నాయి. భవిష్యత్తులో పరిస్థితులు అనుకూలిస్తే బీఆర్ఎస్‌తో మళ్లీ రాజకీయ సమీకరణాలకు కవితకు అవకాశం ఏర్పడుతుందనే విశ్లేషణ కూడా వినిపిస్తోంది.

**స్పందించకుండా.. వ్యూహాత్మక మౌనమా?**

మరోవైపు కవిత ఆరోపణలపై హరీష్ రావు పెద్దగా స్పందించకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా క్షేత్రస్థాయి రాజకీయాల్లో ఉన్న హరీష్‌పై చేసిన ఆరోపణలు ఎంతవరకు ప్రజల్లో ప్రభావం చూపుతాయన్నది మిగతా 02లో

- గైరాంగ్ సరిహద్దు చెక్ పోస్టు వద్ద భయానక దృశ్యాలు
- ఈషా ఫౌండేషన్ కు చెందిన 80 మంది గల్లంతు
- ఆచూకీ లేని మానససరోవర్ యాత్రికులు

| 626 | 2400 |
|---|---|
| మంది మృతి | మంది గల్లంతు! |

## నేపాల్‌లో ఆగని

# విలయం

### మిగిలింది శిథిలాలే



**ముద్ర డెస్క్ :**
నేపాల్‌లో భోటేకోషి నది ఉగ్రరూపం దాల్చడంతో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, నదుల ఉప్పొంగుతో రసువా, నువాకోట్, దాదింగ్, చిత్వాన్ జిల్లాల్లో భారీ ఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు వరద ప్రాంతాల నుంచి 626 మృతదేహాలను వెలికితీశారు. సుమారు 2,400 మందికి పైగా ఆచూకీ ఇంకా తెలియరాలేదు. రెస్క్యూ బృందాలు ప్రాణాలకు తెగించి ఇప్పటివరకు మిగతా 02లో

## కాంగ్రెస్ తేనెతుట్టెను

# కదిపిన గుత్తా

### రాష్ట్ర కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీలో వర్గపోరును అరికట్టి, క్రమశిక్షణ పెంచాలని సూచన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్డంకులు సృష్టించవద్దని హితవు
- పెంఛన్లను రూ.3,000కు పెంచాలని ప్రభుత్వానికి సలహా
- ఉచితాలు క్రమంగా తగ్గించాలన్న గుత్తా సుఖేందర్ రెడ్డి
- అసలు టార్గెట్ ఎవరిపై?



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వం పనితీరులో నూతనోత్తేజం వస్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను అరికట్టి, క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలలో క్రమశిక్షణ కొరవడిందని గుత్తా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలోని గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సీనియర్ నేత చిన్నారెడ్డి పార్టీ నియమావళిని అతిక్రమించి మాట్లాడటం సరికాదని, హద్దులు దాటే వారిపై చర్యలు తీసుకోకపోతే పార్టీకే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం, పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో సమాచార లీకేజీలను అదుపు చేయాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని, ఆయనకు ఎటువంటి ఆటంకాలు మిగతా 02లో

### యాదాద్రి నీటి ప్రాజెక్టులపై సీపీఐ(ఎం) 03

## పోరుబాట

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ నీటి ప్రాజెక్టులపై లేదు
- యాదాద్రి జిల్లాకు గోదావరి జలాల వాటా కేటాయించాలి
- సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమం

కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య



### ధర్మపురి ఆలయ అభివృద్ధికి 03

## సహకరించాలి

- అభిప్రాయాలు తీసుకుంటాం
- భక్తులకు అనుకూలంగా సౌకర్యాలు
- గోదావరి పుష్కరాలకు రూ. 40కోట్ల రూపాయలు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



## సర్‌పై అభ్యంతరాలు

### గడువు పొడిగించాలని సీఈసీకి సీఎం లేఖ 02

- మరో 4 వారాలు గడువు కోరిన సీఎం
- ఓటర్ల జాబితాలో లోపాలు.. సవరణకు అదనపు సమయం
- నోటీసులకు 4 వారాల గడువివ్వాలని అభ్యర్థన
- హైదరాబాద్ సహా 3 జిల్లాల్లో అదనపు ఈఆర్వోలు కోరిన సీఎం



# కాంగ్రెస్‌కు షాక్! 02

**ఇండియా టుడే- సీ ఓటర్ సర్వేలో సంచలనాలు**

- రేవంత్ కి సగం బలమేనా ?
- కాంగ్రెస్ 4 సీట్లకే పరిమితం?
- రాష్ట్రంలో బలపడిన బీజేపీ
- కమలం ఖాతాలో 9 సీట్లు!
- బీఆర్ఎస్‌కు మళ్లీ ఊపొచ్చిందా?
- కాంగ్రెస్‌కు సర్వే హెచ్చరిక!



### ఎంఐఎం ఎమ్మెల్సీపై

## వేటు 02

మిర్జా రహ్మత్ బేగ్ ను బహిష్కరించిన ఓవైసీ



- వెంటనే పదవికి రాజీనామా చేయాలని ఆదేశం
- బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారని ఆరోపణలు
- అర్ధరాత్రి ప్రకటించిన పార్టీ జాయింట్ సెక్రెటరీ

## ఇదీ AI ముద్ర



## రాత్రి ఆలస్యంగా భోజనం చేయొద్దు



రాత్రి ఆలస్యంగా భోజనం చేసి వెంటనే నిద్రించడం వల్ల జీర్ణవ్యవస్థపై అదనపు భారం పడుతుందని నిపుణులు హెచ్చరించారు. భోజనం, నిద్రకు మధ్య తగిన సమయం ఉండేలా చూసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ తేనెతుట్టెను కదిపిన గుత్తా

(మొదటి పేజీ తరువాయి)
సృష్టించకుండా స్వేచ్ఛగా పనిచేసే అవకాశం కల్పించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి హితవు పలికారు. ప్రస్తుతం ప్రభుత్వంపై సామాన్య ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూనే, ప్రభుత్వం నూతన పథకాలను అమలు చేస్తోందని, అయితే ప్రభుత్వ కార్యక్రమాలకు మరింత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంక్షేమ పథకాలపై స్పందిస్తూ, ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను రూ. 3,000కు పెంచాలని, 22ఏ నిబంధనను రద్దు చేసి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉచిత పథకాలను క్రమంగా తగ్గించాలని ప్రభుత్వానికి సూచించారు.



## సజ్జల నన్ను కొట్టాడు.. జగన్ సైలెంట్ గా ఉన్నాడు

**ముద్ర, హైదరాబాద్ :**
సోనియా గాంధీని ఎదిరించి పార్టీ పెట్టిన తర్వాత.. వైయస్ జగన్మోహన్ రెడ్డికి అన్నీ తనై నడిపించారు విజయసాయిరెడ్డి. జగన్ కంపెనీలలోకి ప్రవహించిన పెట్టుబడులు.. ఆయన స్థాపించిన సంస్థలు.. సంపాదించిన ఆస్తులు.. వీటన్నిటిని పర్యవేక్షించారు విజయసాయిరెడ్డి. అప్పట్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు పెట్టినప్పుడు.. కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరకకుండా జగన్ స్థాపించిన కంపెనీల వ్యవహారాలను.. లోగోట్టును బయటపడకుండా చూశారు విజయసాయిరెడ్డి. 2019 ఎన్నికల్లో జగన్ గెలవడంలో షర్మిల ఎంతైతే పాత్ర పోషించారు.. అంతకుమించిన స్థాయి పాత్రను విజయసాయిరెడ్డి పోషించారు. నాడు రాజ్యసభ సభ్యుడిగా విజయ సాయి రెడ్డి ఉండేవారు. ఎప్పుడైతే సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కోటరీలో చేరిపోయారో అప్పుడే పరిస్థితి మారిపోయింది. విజయసాయి రెడ్డి ప్రభ మసకబారడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో భౌతిక దాడికి గురయ్యారు. ఆ సమయంలో జగన్ పక్కనే ఉన్నప్పటికీ కనీసం మాట కూడా మాట్లాడలేదు. దీనికి తోడు అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని తప్పించారు. దీంతో తట్టుకోలేక విజయసాయిరెడ్డి బయటికి వచ్చేసారు. పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా వదులుకున్నారు.
పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి అసలు విషయాలను బయటపెడుతున్నారు.. మద్యం కుంభకోణం.. ఇతర అక్రమాలను ఆయన మీడియా ముందు ఉంచుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా విజయసాయిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాడు పార్టీలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను.. అవమానాలను ఆయన బయటపెట్టారు. 2022లో వైసీపీ ప్లీనరీలో అందరి ముందు విజయసాయి రెడ్డిపై సజ్జల రామకృష్ణారెడ్డి



భౌతిక దాడి చేశారు. నాడు జగన్ ప్రత్యేక పాత్రకే పరిమితమయ్యారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని జగన్ తప్పించారు. అంతేకాదు నాటి సజ్జల కేవలం ఎమ్మెల్యేలు ఎంపీలకు మాత్రమే కాకుండా మంత్రులకు కూడా జగన్ అపాయింట్మెంట్ లభించకుండా చేశారట. అందువల్లే వైసీపీ ఓడిపోయిందట. ఇప్పుడు టిడిపి కూటమితో సజ్జల రాజీ పడ్డారట. అందువల్లే నమోదైన కేసులలో ఆయన పేరు మీద చార్జిషీట్ ఏర్పాటు చేయలేదట. అంతేకాదు సజ్జల వల్ల జగన్ తన కుటుంబానికి దూరమయ్యారట. ఒకవేళ 2029 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ఓటమి ఎదురైతే అది ముమ్మాటికి సజ్జల వల్లేనని విజయసాయి రెడ్డి ఆరోపించారు. మొత్తానికి విజయసాయిరెడ్డి మరోసారి వైసీపీలో ఉన్న అసలు వ్యవహారాలను బయట పెట్టడంతో.. ఇప్పుడు ఆ పార్టీ నేతలకు మాట్లాడే అవకాశం లేకుండా పోతుంది. సరిగా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు వైసీపీలో జరుగుతున్న వ్యవహారాలను విజయసాయిరెడ్డి బయట పెట్టడంతో.. పార్టీకి ఉక్కపోత ఎదురవుతోంది.

## ఎంఐఎం ఎమ్మెల్సీపై వేటు

**ముద్ర, హైదరాబాద్ :**
ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌పై ఎంఐఎం వేటు వేసింది. వెంటనే ఎంఎల్ సికి రాజీనామాకు చేయాలని ఆదేశించింది. బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌పై ఆ పార్టీ కఠిన చర్యలు తీసుకుంది. ఎంఐఎం పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తన



ఎక్స్ ఖాతాలో పార్టీ ప్రకంటించింది. వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి మండలి ఛైర్మన్‌కు లేఖ పంపాలని ఆదేశించింది. 2023లో ఎమ్మెల్సీగా ఎన్నికైన రహ్మత్ బేగ్ పదవీకాలం 2029 మే వరకు ఉన్నప్పటికీ పార్టీ నిర్ణయంతో రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తూ మీర్జా రహ్మత్ బేగ్ పట్టుబడడంతో ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ సయ్యద్ సబ్దర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. అత్తాపూర్‌లో కొందరు యువకులు ఎంఎల్సీని పట్టుకుని కొట్టడంతో పాటు వీడియోలు తీసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి ముందే తెలుసని, అయినా రహ్మత్ బేగ్‌ను ఉమ్రాకు పంపించారని సబ్దర్ అలీ ఆరోపణలు చేశారు. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇప్పుడు ఎలాంటి కారణం చెప్పకుండా సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు. ఎంఎల్‌ఏకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలోవైరల్ గా మారినట్టు సమాచారం.

## నేపాల్‌లో ఆగని వరద విలయం

(మొదటి పేజీ తరువాయి)
4,450 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. కాపాడిన వారిలో దాదాపు 187 మంది విదేశీ పౌరులు ఉన్నారు. కొండచరియలు విరిగిపడటం, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు నేపాల్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది.





రంగంలోకి భారత్, చైనా ప్రత్యేక బృందాలు వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు నేపాల్ ప్రభుత్వం అంతర్జాతీయ సాయాన్ని అభ్యర్థించింది. సొరంగాల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు భారతదేశం నుంచి 11 మంది నిపుణులతో కూడిన సాంకేతిక బృందం అక్కడకు చేరుకుంది. చైనా నుంచి కూడా ప్రత్యేక టన్నెల్ రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగుతోంది. భారత్ ఇప్పటికే 57 టన్నులకు పైగా సహాయక సామగ్రిని నేపాల్‌కు చేరవేసింది. చైనా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల నుంచి అత్యవసర ఆహారం, మందులు, టెంట్లు వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుతున్నాయి.

### విదేశీయుల కోసం కంట్రోల్ రూమ్

విపత్తులో చిక్కుకున్న విదేశీ పర్యాటకులకు సహాయం అందించేందుకు నేపాల్ విదేశాంగ శాఖ ప్రత్యేక ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. బాధితుల కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరపడం, మృతదేహాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయడం, మృతదేహాలను స్వదేశాలకు పంపే ప్రక్రియలను ఈ విభాగం పర్యవేక్షిస్తోంది. అనేక దేశాల రాయబార కార్యాలయాలు ఈ కంట్రోల్ రూమ్ ద్వారా తమ దేశ పౌరుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాయి.

### భారీగా మౌలిక వసతుల నష్టం

వరదల వల్ల జరిగిన ఆస్తి నష్టాన్ని అంచనా వేసే పనిని నేపాల్ సర్కార్ ప్రారంభించింది. కీలకమైన వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ కేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. తక్షణ సహాయంతో పాటు భవిష్యత్తులో ఈ మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి ప్రపంచ దేశాల ఆర్థిక సహకారం ఎంతో అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. తాము విదేశీ సాయాన్ని నిరాకరించినట్లు వస్తున్న వార్తలను నేపాల్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి నేరుగా ఆన్‌లైన్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాలివ్వచ్చని ప్రకటించింది.

### పర్యాటకులకు స్పష్టత

వరద ప్రభావిత ప్రాంతాలు మినహా మిగిలిన నేపాల్ అంతటా సాధారణ పరిస్థితులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. విదేశీ యాత్రికులు, పర్యాటకులు ఇతర ప్రాంతాలను ఎలాంటి భయం లేకుండా సందర్శించవచ్చని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకోవడంతో పాటు దేశంలో పర్యాటక రంగం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రస్తుతం గల్లంతైన వారిని గుర్తించడమే లక్ష్యంగా సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

## సర్‌పై అభ్యంతరాలు

**ముద్ర హైదరాబాద్ :**
ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని కోరుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలని కోరారు. 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు.
ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని, ఇళ్లు మారితే నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను కనీసం రెండుసార్లు చదివి వినిపించాలన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, మండలస్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌నూ ఆమోదించాలని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు ఈఆర్‌వోలను నియమించాలని కోరారు.




## తెలంగాణలో కాంగ్రెస్‌కు షాక్!

**ముద్ర డెస్క్ :**
ఇండియా టుడే – సీ ఓటర్ సంయుక్తంగా నిర్వహించిన తాజా మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో వస్తున్న కీలక మార్పుల్ని సూచిస్తున్నాయి. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారిపోతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంట్ స్థానాలను గెలుచుకుని జోరు మీదున్న అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ సర్వే ఇబ్బంది కలిగించే అంచనాలను వెలువరించింది.ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ బలగం సగానికి సగం పడిపోయి, కేవలం నాలుగు స్థానాలకే పరిమితమవుతుందని సర్వే తేల్చింది.
దేశవ్యాప్తంగా ప్రతిపక్ష కూటమి ఊపందుకుంటోందన్న అంచనాలు వెలువడుతున్నప్పటికీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ గ్రాఫ్ వేగంగా పడిపోతుండటం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యారంటీల అమలులో ఎదురవుతున్న సవాళ్లు, క్షేత్రస్థాయిలో పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత ఈ సగానికి సగం సీట్లు కోల్పోవడానికి ప్రధాన కారణాలుగా విశ్లేషిస్తున్నారు. లోక్‌సభ ఫలితాల జోరును కొనసాగించడంలో అధికార యంత్రాంగం, పార్టీ నాయకత్వం విఫలమవుతోందనే సంకేతాలను ఈ సర్వే స్పష్టంగా పంపుతోంది.
మరోవైపు భారతీయ జనతా పార్టీ తెలంగాణలో తన పట్టును మరింత బిగిస్తోందని ఈ సర్వే అంచనాలు వెల్లడిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో గెలుచుకున్న 8 స్థానాల నుంచి మరో స్థానాన్ని అదనంగా సొంతం చేసుకుని 9 సీట్లకు చేరుకుంటుందని సీ ఓటర్ పేర్కొంది. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠతో పాటు, లోక్‌సభ స్థాయిలో బీజేపీ చూపుతున్న చొరవ ఆ పార్టీకి మైలేజ్ ఇస్తోంది. కాంగ్రెస్ కోల్పోతున్న స్థానాల్లో అత్యధిక భాగం బీజేపీ ఖాతాలోకి మళ్లుతుండటంతో, రాష్ట్రంలో కమలం పార్టీ మరింత బలమైన ప్రతిపక్షంగా, నంబర్ వన్ శక్తిగా ఎదుగుతున్నట్లు కనిపిస్తోంది.
ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేక పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన భారత్ రాష్ట్ర సమితి సర్వే ఫలితాల్లో కాస్త ఉపశమనం పొందినట్లు కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బిఆర్ఎస్ కోలుకుని 3 లోక్‌సభ స్థానాలను సొంతం చేసుకుంటుందని సర్వే అంచనా వేసింది. ఇక హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో మజ్లిస్ తన పాత సాంప్రదాయ విజయ పరంపరను కొనసాగిస్తూ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంటుందని తెలిపింది. మొత్తానికి ఈ సీ ఓటర్ సర్వే ఫలితాలు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌కు హెచ్చరిక లాంటివని, రాబోయే రోజుల్లో గ్రౌండ్ లెవల్‌లో వ్యూహాలు మార్చుకోకపోతే హస్తం పార్టీకి మరిన్ని సవాళ్లు తప్పవని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## హరీష్ రావే టార్గెట్..

(మొదటి పేజీ తరువాయి)
ప్రశ్న. కేటీఆర్‌తో కలిసి హరీష్‌రావు ప్రతిపక్ష పోరాటం కొనసాగిస్తుండటంతో బీఆర్ఎస్ అంతర్గత సమీకరణాలు కూడా ఆసక్తికరంగా మారాయి.

### కవిత వ్యూహం ఫలిస్తుందా?

హరీష్‌రావును బీఆర్ఎస్‌కు దూరం చేయడంలో కవిత వ్యూహం సఫలమైతే తెలంగాణ రక్షణ సేనకు రాజకీయంగా కొత్త ఊపు రావచ్చు. అయితే అదే సమయంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చీలి కాంగ్రెస్, బీజేపీలకు లాభించే అవకాశమూ ఉంది. దీంతో కవిత–హరీష్ రాజకీయ సమరం భవిష్యత్ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపులకు కారణమయ్యే అవకాశముంది.

## ఒకే రోజులో 1,13,109 విత్తన బంతులు

**ముద్ర, విజయవాడ:**
CII యంగ్ ఇండియన్స్ (Yi) అమరావతి చాప్టర్ అరుదైన ఘనత సాధించింది. విజయవాడలోని పీ.బీ. సిద్ధార్థ కళాశాల ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్లో ఒకే రోజులో 1,13,109 స్థానిక వెదురు విత్తన బంతులను తయారు చేసి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్లో స్థానం సంపాదించింది. “Maximum Native Bamboo Seed Balls Prepared by a Youth Organization” విభాగంలో ఈ రికార్డు నమోదైంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువ వాలంటీర్లు, Yi సభ్యులు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పచ్చదనం పెంపు, అటవీ విస్తరణ, పర్యావరణ పరిరక్షణపై యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆచరణాత్మకంగా పర్యావరణ సేవ చేయడమే కార్యక్రమం లక్ష్యంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు రికార్డును అధికారికంగా ధ్రువీకరించారు.

## ప్రాణహితకు పునరుజ్జీవం

### 152 మీటర్ల బ్యారేజీ కోసం తెలంగాణ పట్టు

**ముద్ర, హైదరాబాద్:**
ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునరుజ్జీవనానికి తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సెప్టెంబర్ 1న ఢిల్లీలో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య జరగనున్న అంతర్రాష్ట్ర చర్చల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.
తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. 2016లో గత ప్రభుత్వం అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్ల కోసం తెలంగాణ బలమైన సాంకేతిక, న్యాయపరమైన వాదనలు వినిపించనుందని చెప్పారు.
152 మీటర్ల బ్యారేజీ సాధ్యమైతే సుందిళ్లకు గురుత్వాకర్షణ ద్వారా దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను తరలించే అవకాశం ఉంటుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో భారీ ఎత్తిపోతలపై ఆధారపడటం తగ్గి, రాష్ట్రంపై పడే విద్యుత్, నిర్వహణ వ్యయం కూడా గణనీయంగా తగ్గుతుందని వివరించారు.
ప్రాణహిత–చేవెళ్ల అసలు లక్ష్యం సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమేనని మంత్రి గుర్తుచేశారు. ప్రాజెక్టు పునరాకల్పన కారణంగా ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక ఆయకట్టు ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలను కోల్పోయాయని అన్నారు.
'కోల్పోయిన ఆయకట్టుకు తిరిగి సాగునీటి భరోసా కల్పించడమే ప్రాణహిత పునరుజ్జీవన లక్ష్యం. తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం ప్రజా ప్రభుత్వ బాధ్యత” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 చర్చల్లో మహారాష్ట్రతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూనే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని తెలిపారు.



## 'సర్' నోటీసులివ్వాలి

**ముద్ర, హైదరాబాద్:**
ఎస్ఐఆర్‌లో నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బీఎల్వోలు ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా ఇవ్వాలని సీఈవో స్పష్టం చేశారు. రెండు రోజుల ముందు విచారణ ప్రాంతం, తేదీ, సమయం ఓటర్లకు తెలపాలన్నారు. నోటీసులకు వారం రోజుల్లో వివరణ ఇచ్చే గడువును కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియలపై జిల్లాల కలెక్టర్లతో సీఈవో సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.
నోమ్యాపింగ్, అనామలిస్ ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు ఇవ్వాలని సీఈవో తెలిపారు. నోటీసుతో పాటు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల వివరాలను ప్రతీవారం రాజకీయ పార్టీలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జీఎస్ చారి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 30.08.2026
www.mudranews.in | @mudranews



### ఆహారం తీసుకునే సమయాన్ని నియంత్రించండి

ఆహారం తీసుకునే సమయం, పరిమాణంపై నియంత్రణ ఉండాలని డా. మంతెన సూచించారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో పాటిస్తున్న ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ విధానాన్ని కూడా ప్రస్తావించారు.



# యాదాద్రి నీటి ప్రాజెక్టులపై సీపీఐ(ఎం) పోరుబాట

**- సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ నీటి ప్రాజెక్టులపై లేదు.**
**- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య**
**- యాదాద్రి జిల్లాకు గోదావరి జలాల వాటా కేటాయించాలని డిమాండ్**
**- సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమం**





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) మహా పాదయాత్ర చేపట్టింది. భువనగిరి అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వరకు కొనసాగనుంది. అనంతరం మహాధర్నా నిర్వహించి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య మాట్లాడుతూ.. జిల్లాలో 7.5 లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేస్తే జిల్లా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాకు గోదావరి జలాల వాటా కేటాయించాలని, మూసీ ప్రక్షాళనలోనూ ఈ ప్రాంత ప్రజల నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ.. బస్వాపురం, గంధమల్ల, చర్లగూడెం రిజర్వాయర్లతో పాటు పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాలువలు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి నిధులు ఒకేసారి కేటాయించి, ప్రతి పనికి గడువు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోతే పాదయాత్రతో ఉద్యమం ముగియదని, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలను కలుపుకుని మరింత విస్తృత ఉద్యమాన్ని చేపడతామని సీపీఐ(ఎం) నేతలు హెచ్చరించారు. దీంతో యాదాద్రి జిల్లాలో పెండింగ్ నీటి ప్రాజెక్టుల అంశం మరోసారి రాజకీయ చర్చలోకి వచ్చింది.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ పైళ్ల ఆశయ డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు కల్లూరి మల్లేశం దాసరి పాండు జెల్లెల పెంటయ్య బూరుగు కృష్ణారెడ్డి గుంటోజు శ్రీనివాసాచారి జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి సిర్పంగి స్వామి దయ్యాల నరసింహ మాయ కృష్ణ మద్దెల రాజయ్య బొల్లు యాదగిరి, బొడ్డుపల్లి వెంకటేష్ గుండు వెంకటనర్సు గంగదేవి సైదులు దోడ యాదిరెడ్డి మద్దేపూరం రాజు బోలగాని జయరాములు అవ్వారు రామేశ్వరి ఎంఎ ఇక్బాల్ వనం ఉపేందర్ గడ్డం వెంకటేష్ రాగీరు కిష్టయ్య మల్లేపల్లి లలిత బల్గూరి అంజయ్య కోట రామచంద్రారెడ్డి గోశిక కరుణాకర్ మండల కార్యదర్శిలు జిల్లా ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న నీటిపారుదలపై సీఎం రేవంత్ రెడ్డికి రైతు సంక్షేమ కమిషన్ కీలక నివేదిక



**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణలో చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేయడం, చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కీలక నివేదిక సమర్పించింది. కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి ముఖ్యమంత్రిని కలిసి నివేదికలోని అంశాలను వివరించారు.చిన్న నీటిపారుదల రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతిక యూనిట్లతో ప్రత్యేక చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానిస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. ముఖ్యంగా చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి వాటిని పరిరక్షించాలని నివేదికలో స్పష్టం చేసింది.తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత కీలకమని కమిషన్ అభిప్రాయపడింది. చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా వ్యవసాయ రంగానికి కీలకమైన ఆస్తులుగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలు సూచనలు చేశారు. పంటల మార్పిడిని ప్రోత్సహించడం, ఉద్యానవన పంటల సాగును పెంచడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (FPOs) ఏర్పాటును విస్తరించడం వంటి అంశాలపై కమిషన్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.గత రెండేళ్ల కాలంలో రైతు సంక్షేమ కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ బృందం ముఖ్యమంత్రికి వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల పరిరక్షణ, వ్యవసాయ స్థిరీకరణకు మరిన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

### జాతీయ క్రీడా దినోత్సవం: క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**ముద్ర, హైదరాబాద్:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్రీడాకారులకు, క్రీడాభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన స్ఫూర్తితో క్రీడాకారులు లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్ర స్పోర్ట్స్ పాలసీ, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని సీఎం తెలిపారు. అత్యుత్తమ మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలు కల్పిస్తూ.. రాష్ట్ర, దేశ కీర్తిని ప్రపంచ వేదికలపై నిలబెట్టే క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

### గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి



**ముద్ర, హైదరాబాద్** : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి, VC&MD సోనీ బాలాదేవి, అర్జున అవార్డు గ్రహీత గాయత్రి గోపీచంద్, బ్యాడ్మింటన్ ఛాంపియన్ త్రిష జాలీ, ఆసియన్ అథ్లెట్ నందిని అగసర, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా విజయ్, కార్యదర్శి భీమ్ సింగ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి, ఎండీ సోనీ బాలాదేవితో కలిసి మేజర్ ధ్యాన్‌చంద్ స్మారక 'ఖేలో తెలంగాణ హాకీ లీగ్' ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు.

## తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకుంటాం..
**- సీఎం రేవంత్**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములు నాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.

## ధర్మపురి ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాలు సహకరించాలి

**అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుంటాం..**
**పెరుగుతున్న జనాభా కు అనుకూలంగా సౌకర్యాలు..**
**గోదావరి పుష్కరాలకు మరో 40కోట్ల రూపాయలు..**
**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



**ముద్ర, న్యూస్ , ధర్మపురి:** ధర్మపురి క్షేత్రంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, ఆలయ అభివృద్ధిలో భాగంగా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు తీసుకొని అమలు చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న ఉగ్ర నరసింహ స్వామి దేవాలయం పునర్ నిర్మాణంపై సమీక్ష సమావేశం శనివారం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జగిత్యాల జిల్లా గంధ్రాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్ తో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, ధర్మపురి పేద బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు నిధులు కేటాయించాలని అన్నారు. బాసర, కాళేశ్వరం, భద్రాచలంతో ధర్మపురి క్షేత్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి గారు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం ధర్మపురిలోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తామని తెలిపారు. పునర్ నిర్మాణం కోరకు ప్రభుత్వం రూ.10కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి లోని యోగ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కేంద్రం పరిధిలో ఉన్న నేపథ్యంలో మొదట ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

ధర్మపురి అగ్రహారం బ్రాహ్మణులు, వేద పండితులతో పాటు పట్టణ ప్రజల అభిప్రాయాలను తీసుకొని ముందుకు సాగుతామని ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

గోదావరి పుష్కరాలకు ధర్మపురి నియోజకవర్గానికి ఇప్పటికీ ప్రభుత్వం రూ. 117 కోట్లు కేటాయించింది మంత్రి తెలిపారు. రూ. 40 కోట్లు బైపాస్ రోడ్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు విడుదల కానున్నయని మంత్రి తెలిపారు.

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ధర్మపురి లోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణం రూ.10 కోట్లతో చేపడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న యోగా నరసింహ స్వామి ఆలయ ప్రతిష్టకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. స్థపతి ప్రసాద్ ఈ సందర్భంగా పునర్నిర్మాణ వివరాలను వివరించారు.

## తెలంగాణ బీజేపీ భవిష్యత్ కార్యాచరణపై కీలక సమావేశం

**ముద్ర, హైదరాబాద్:** నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అధ్యక్షతన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, మోదీ@25 కార్యక్రమాల నిర్వహణపై నేతలు చర్చించారు. అలాగే సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22A సమస్యపై ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న నిరసన దీక్ష, సెప్టెంబర్ 7న ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాపై కార్యాచరణను సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



# వేప చెట్టుకోసం 25 ఏళ్లుగా గొడవ..

**ఇద్దరి దారుణహత్య**
**తండ్రి, ప్రత్యర్థి హతం**
**25 ఏళ్ల పాత గొడవకు విషాదాంతం..**



**ముద్ర, సూర్యపేట** : సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో దారుణం జరిగింది. ఇంటిపక్కనున్న వేపచెట్టు విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కేసును పక్కదారి పట్టించేందుకు కుమారుడే తండ్రిని చంపడం మరింత విషాదంగా మారింది. ఇంటి సరిహద్దులో ఉన్న వేప చెట్టు విషయంలో వెంకటే శ్వర్లు, భూక్యా సైదా కుటుంబాల మధ్య 25 ఏళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం ఉదయం వెంకటేశ్వర్లు కొంతమందిని పిలిచి వేపచెట్టు నరికించారు. భూక్యా సైదా కుమారుడు రాము ఈ విషయాన్ని గమనించి వెంకటేశ్వర్లు వద్దకు వెళ్లి.. చెట్టు విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి, ఎలా చెట్టును కొట్టేస్తారని ప్రశ్నించారు. దీంతో గొడవ పెద్దది కావడంతో భూక్యా రాము గొడ్డలితో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదంతా గమనించిన భూక్యా రాము తండ్రి సైదా అక్కడికి వెళ్లి అడ్డుకోబోయే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో రాము తన తండ్రిపై కూడా గొడ్డలితో దాడి చేయడంతో సైదా కూడా మృతి చెందారు. వేప చెట్టు విషయంలో పరస్పరం జరిగిన దాడుల్లో వెంకటేశ్వర్లు మృతి చెందాడని చిత్రీకరించేందుకే రాము తన తండ్రిపై దాడి చేశాడని స్థానికులు చెబుతున్నారు. ఇదంతా గమనించిన గ్రామస్థులు భూక్యా రాము ఇంటిపై రాళ్ల దాడికి దిగారు. సమాచారం తెలుసుకుని ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మేళ్ల చెరువు ఎస్ఐ నవీన్ కుమార్ తలకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరిని గొడ్డలితో నరికి చంపిన రామును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సంజీవనితో ఆరోగ్య విప్లవం: చంద్రబాబు

**మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్యం..**



**ముద్ర, అరకు** : మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అరకు లోయ నియోజకవర్గంలోని గన్నెలలో సంజీవని కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన.. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేలా రూపొందించిన సంజీవని ప్రాజెక్టును త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు.గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక వసతుల కోసం రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్‌ను చేపడుతున్నట్లు సీఎం ప్రకటించారు. డ్రోన్ల ద్వారా అత్యవసర మందులు, వ్యాక్సిన్లు, రక్త నమూనాలను తరలించి వేగంగా పరీక్షలు నిర్వహించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, 104 వాహనాలతో సంచార వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఐదు సూత్రాలతో ప్రణాళిక రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రహదారులను నిర్మించామని, లక్షలాది ఇళ్లకు కుళాయి నీరు, సోలార్ రూఫ్‌టాప్‌లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించడంతో పాటు హోమ్‌స్టేల ద్వారా గిరిజన కుటుంబాలకు ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే మూడేళ్లలో లక్ష మంది గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గిరిజనులకు ఉద్యోగాల్లో స్థానిక అవకాశాలు కల్పించేందుకు జీఓ నంబర్ 3కు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలో తీసుకొస్తామని సీఎం చెప్పారు. సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీటిని అనకాపల్లికి తీసుకురానున్నట్లు చంద్రబాబు తెలిపారు. మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 30.08.2026
www.mudranews.in
@mudranews
mudratv



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి. అయితే వ్యాయామం కూడా పరిమితికి మించి చేస్తే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ప్రతి రోజూ గంటల తరబడి.. శారీరక శ్రమ చేయడం వల్ల ప్రాణాంతక పరిస్థితులకు దారితీయొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో 'రాబ్డోమయోలైసిస్' అనే సమస్య వచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు. అసలేంటిది?

# అతి వ్యాయామం వద్దు

తీవ్రమైన వ్యాయామం లేదా గాయాల కారణాల వల్ల కండరాల కణాలు దెబ్బతినే పరిస్థితిని రాబ్డోమయోలైసిస్ అంటారు. కండరాలు దెబ్బతిన్నప్పుడు వాటిలో ఉండే మయోగ్లోబిన్ అనే ప్రోటీన్ రక్తంలోకి విడుదల అవుతుంది. ఈ మయోగ్లోబిన్ మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపి వాటి పనితీరును దెబ్బతీయవచ్చు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే గుండె సంబంధిత సమస్యలతో ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.

కొందరు వైద్యులు తెలుపుతున్న ప్రకారం.. ఓ వ్యక్తి ఒక్కసారిగా మూడు గంటల పాటు తీవ్రమైన జిమ్ వర్కౌట్ చేస్తే అతని కండరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఈ సమయంలో మయోగ్లోబిన్ విడుదలై రక్తంలో కలవడంతో మూత్రం ముదురు రంగులోకి మారుతుంది. కండరాల కణాలు దెబ్బతిన్నప్పుడు విడుదలయ్యే పొటాషియం రక్తంలో అధికమైతే గుండె స్పందన అసాధారణంగా మారే ప్రమాదం ఉంది. గుండె లయలో మార్పులు, గుండె ఆగిపోవడం వంటి తీవ్రమైన పరిస్థితులు తలెత్తవచ్చు.

రాబ్డోమయోలైసిస్ వచ్చినప్పుడు తీవ్రమైన కండరాల నొప్పి ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు. కండరాల్లో బలహీనత, వాపు, చేతులు లేదా కాళ్లు కదిలించడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉండొచ్చు. ముఖ్యంగా టీ లేదా కోలా రంగులో మూత్రం రావడం ఈ సమస్యకు ప్రధాన హెచ్చరిక సంకేతంగా భావిస్తారు.

వ్యాయామాన్ని ఒక్కసారిగా అధికంగా చేయకుండా క్రమంగా శరీరాన్ని అలవాటు చేయాలి. చాలా రోజుల తర్వాత జిమ్ ప్రారంభిస్తే తేలికపాటి వ్యాయామాలతో మొదలుపెట్టి, శిక్షణ పొందిన ట్రైనర్ పర్యవేక్షణలోనే తీవ్రతను పెంచాలి. వ్యాయామానికి ముందు, తర్వాత తగినంత నీరు తాగడం, మధ్యలో శరీరానికి విశ్రాంతి ఇవ్వడం కూడా ఎంతో ముఖ్యం. శరీరం ఇచ్చే హెచ్చరిక సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు.

# ఎండమావి బతుకులు

మానవ జీవిత వికాసంలో అడుగడుగునా స్నేహానికి ఎంతో విలువ ఉంది. మనిషిని సంఘ జీవి అంటారు. తోడు మనసుకు ఎంతో అవసరం. దానిని తీర్చేవాడు ఒక్క స్నేహితుడు మాత్రమే. తమ దగ్గర వారితో ఆఖరుకు రక్త సంబంధీకులతో సైతం చెప్పుకోలేని ఎన్నో విషయాలను స్నేహితులతో పంచుకోవడం జరుగుతుంది. ఒక్క స్నేహితుడు ఉంటే చాలు వేయి కష్టాలు సులువుగా దాటవేయవచ్చు అన్నది పెద్దలు చెప్పే మాట. పురాణాలలో చూస్తే ధుర్యధనుడు కర్ణుడు మధ్య ఉన్నది అవ్యాజమైన మిత్రుత్వం. హితుడా అంటూ సుయోధనుడు కర్ణుడికి తన జీవితంలో ఇచ్చిన ప్రాధాన్యం, దానికి తగినట్లుగానే కర్ణుడు దోస్త్ కోసం ఎంతకైనా చేసేందుకు వెనకాడని తత్వం యుగాలు దాటినా అందరికీ స్పూర్తిగా ఉంటాయి. అలాగే శ్రీకృష్ణుడు కుచేలుడి మధ్య పేద గొప్ప అంతరాలను దాటిన స్నేహం కూడా అద్భుతం అనిపిస్తుంది.



**గతంలోనే బంధం:** మన పూర్వీకులు నిన్నా మొన్నటి తరాలు అందరికీ గంపెడు మంది స్నేహితులు ఉండేవారు. టీవీలు లేని రోజుల్లో బ్లాక్ అండ్ వైట్ డేస్ లో స్నేహానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు, గంటలు రోజులు కూడా క్షణాలుగా మార్చేసుకున్న మిత్ర బంధాలు ఎన్నో వెనక్కి వెళ్తే గొప్పగా కనిపిస్తాయి. రెండు దశాబ్దాల నుంచి చూస్తే స్నేహితుడు పాత్ర ప్రతీ వారి జీవితంలో తగ్గిపోతూ వస్తోంది. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత చేతిలో స్మార్ట్ ఫోన్ వచ్చాక అన్నీ తానే అయి ఫ్రెండ్‌ని దూరం చేసిన వర్తమానం అందరికీ కళ్ళ ముందు కనిపిస్తోంది.

**అసలు ఉన్నారా నేస్తాలు:** ఇక స్నేహితుల గురించి ఇటీవల కాలంలో వచ్చిన గణాంకాలు నివేదికలు చూస్తే షాకింగ్ గా ఉంటోంది. 1960 దశకంలో చూస్తే ఒక వ్యక్తికి సగటున వంద మంది వరకు సన్నిహిత స్నేహితులు ఉండేవారని నివేదికలు చెబుతున్నాయి. అదే 1990ల నాటికి వచ్చేసరికి ఆ సంఖ్య సగానికి సగం యాభైకి పడిపోయింది. 2020 కి వచ్చేసరికి అది కాస్తా ఏకంగా పదికి చేరింది. ఈ ఆరేళ్ళ కాలంలో కరోనా వంటి పెను విపత్తులు తరువాత మనిషి మరింత ఒంటరి అయి సామాజిక దూరం పాటిస్తూ పోతున్న సందర్భంలో ఒక్క స్నేహితుడు అయినా లేని వాతావరణం కనిపిస్తోంది అని అంటున్నారు.

**స్నేహం లేదు..:** మారుతున్న ప్రపంచంలో అన్నింటికీ కరవు వచ్చి పడింది అని తెలుసు. కానీ ఇపుడు స్నేహితులకు కూడా కరవు వచ్చేసింది అన్నది వింటే కనుక ఆశ్చర్యంతో పాటు భయం వేస్తుంది. మనిషి భావోద్వేగాలను బంధాలను దాటి ఎక్కడికి పోతున్నాడు అనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇదే నిజం కనిపిస్తోంది. స్నేహితులు అన్నది ఎవరికీ దక్కని చిక్కని వైనం కూడా మన ఎదుటే ఉంది. ఒక్క మంచి స్నేహితుడిని సంపాదించుకో చాలు జీవితం ధన్యం అన్న పెద్దల మాటలు నిశ్శబ్దంలో కలసి పోతున్న వేళ స్నేహితుడిని సైతం స్మార్ట్ ఫోన్ అవతలకు వెళ్ళగొట్టేసింది.

**చెప్పుకునే వారు లేక:** ఈ రోజున మనసు విప్పుదామని ఎవరూ అనుకోవడం లేదు, ఒక వేళ అలా అనుకున్నా తోడుగా నీడగా నిలిచే స్నేహితుడు కనిపించడం లేదు. ఇటీవల జరిగిన ఒక సర్వే చూస్తే కనుక్ నిజమైన స్నేహితుడు ఒక్కరు కూడా లేరని తేలింది. ఆ సర్వే ప్రకారం భారత్ లాంటి ఎంతో సెంటిమెంట్ ఉన్న దేశంలో కూడా 12 శాతం మందికి చెప్పుకోదగ్గ స్నేహితుడు ఒక్కడంటే ఒక్కడూ లేడన్న కఠినమైన నిజం వెల్లడైంది.

**నాటి రోజులు:** గతంలో అయితే ఫ్రెండ్స్ తో గంటల సేపు గడిపిన వారమని పెద్దలు చెబుతున్నారు. కానీ ఇపుడు ఉన్న తరానికి స్మార్ట్ ఫోన్లు ఫ్రెండ్స్ గా మారిపోయాయి. వాటి తోనే పూర్తి కాలం గడుపుతున్నారు. అయితే మంచి స్నేహితులు ఉంటే మనిషి మానసిక ఆరోగ్యం ఎంతగానో బాగుంటుంది, ఒక ధీమా జీవితానికి జీవిత బీమా కూడా వస్తా యని నిపుణులు అంటున్నారు.

ఒంటరిగా జీవించడం అంటే రోజుకు ఇరవై సిగరెట్లు తాగినంత ప్రమాదకరమని పరిశోధనలు కూడా చెబుతున్నాయి. అధిక మానసిక ఒత్తిడి, డిప్రెషన్ వంటివి ఒంటరి వాళ్ళను చుట్టుముడతాయి.

# అందరూ ఉన్నా.. అవే కష్టాలు



బంధాలు, బంధుత్వాలు మనిషి జీవితాన్ని ఎంతో హాయిగా ఉంచుతాయి. పుట్టినప్పటినుంచి చనిపోయే వరకు జీవితంలో ఎంతో మందిని కలుస్తుంటాం. వీరిలో మంచివారు ఉంటారు.. చెడ్డవారు ఉంటారు.. మన బంధువులు, ఆత్మీయులు అందరూ మంచివారని అనుకోలేం.. స్నేహితులు, తోటి పనివారు చెడ్డవారిని అనుకోలేం.. ఒక్కోసారి ఎవరూ లేకపోయినా ఒంటరిగా ఉన్నా కూడా అనిపించని బాధ కంటే.. అందరూ ఉండి కూడా ఇలాంటి సమయంలో ఎక్కువగా బాధ కలుగుతుంది. అలాంటి సమయం ఏంటిది అంటే?

చాలా మంది తమ చుట్టూ ఎంతో మంది ఉన్నారు.. తమకు ఎప్పుడు అంటే అప్పుడు సహాయం చేస్తారు.. అని భావిస్తారు. కానీ సంతోష సమయంలో ఉన్నవారి కంటే ఆపదలో తోడుగా ఉన్నవారే నిజమైన మిత్రులు.. బంధువులు. ఒక వ్యక్తికి తాను సంతోషంగా ఉన్నప్పుడు తన చుట్టూ ఎంతోమంది ఉంటారు. కానీ అప్పుడు ఎదుటివారి విలువ, గుణాలు తెలియరావు. తనకు కష్టం వచ్చినప్పుడు ఎలాంటి వారు సహాయం చేశారు? ఎవరు తనకు ఆప్త మిత్రులుగా ఉన్నారు? అనే విషయం తెలుస్తుంది. కనీసం ఈ సమయంలోనైనా మంచివారు ఎవరో? చెడ్డవారు ఎవరో? తెలుసుకొని వారితో.. వారికి అనుగుణంగా ఉండడమే మంచిది.

మీకు దగ్గరి బంధువులైనా.. దూరపు స్నేహితులైనా.. మీకోసం 20% కష్టపడడం లేదా మీ కోసం పనులు చేయడం వంటి వారు ఉంటే.. వారి కోసం 100% కష్టపడాల్సిన అవసరం లేదు. వారు ఎంత అయితే సేవ చేస్తున్నారో.. మనతో ఎలాగైతే ఉంటున్నారో.. వారితో కూడా అలాగే ఉండడం మంచిది. ఎందుకంటే మీరు 100% వారికోసం పనిచేసిన కూడా.. వారు ఎప్పటికీ 20% మాత్రమే మీ మీద ప్రేమ లేదా దయ మాత్రమే ఉంటుంది.

చాలా మంది లోపల ఎన్ని బాధలు ఉన్నా.. పైకి సంతోషంగా కనిపిస్తారు. కానీ ఇది ఏమాత్రం సరైంది కాదు. ఎందుకంటే మీలో ఉన్న బాధను దాచిపెడితే ఎదుటివారికి మీరు ఎప్పుడు స్ట్రాంగ్ గా ఉన్నారని అనుకుంటారు. ఫలితంగా మీకు సహాయం చేయడానికి ఎవరు ముందుకు రారు. ఇలాంటి అప్పుడు మీకు ఉన్న బాధను బయటపెడితే ఎవరైనా సహాయం చేస్తున్నారా? లేదా? అనేది చెక్ చేసుకోవాలి. ఇలాంటి సమయంలో సాయం చేసే వారే నిజమైన మిత్రులుగా భావించాలి.

ఇతరులకు సాయం చేయడం మంచిదే. కానీ వ్యక్తిగతంగా నష్టం చేకూర్చి ఇతరులకు మేలు చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఉన్న ఎనర్జీని మిగతా వారి కోసం ఖర్చు చేసి మీకోసం ఏమీ లేకుండా ఒంటరిగా మిగలడం ద్వారా నష్టమే జరుగుతుంది. అయితే మీరు ఇలా సహాయం చేసి మీకు తిరిగి చేసేవారు ఎంత మంది ఉన్నారు? అనేది తెలుసుకోవాలి. అలాంటి సమయంలోనే ఆదుకున్న వారు నిజమైన మిత్రులుగా భావించాలి.

# పిల్లలకు ఫోన్ ఇస్తున్నారా?

## అధ్యయనాల్లో భయంకర నిజాలు

పిల్లలు ఏడుస్తున్నారని, తినడం లేదని, ప్రశాంతంగా ఉండటం లేదని చేతిలో స్మార్ట్‌ఫోన్ పెట్టడం చాలామంది తల్లిదండ్రులకు సాధారణంగా మారిపోయింది. కానీ చిన్న వయసులోనే పిల్లలను ఎక్కువసేపు స్క్రీన్‌లకు అలవాటు చేయడం భవిష్యత్‌లో వారి అభ్యాస సామర్థ్యం, జ్ఞాపకశక్తి, భాషా నైపుణ్యాలు, ఏకాగ్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని తాజా పరిశోధన హెచ్చరిస్తోంది. ముఖ్యంగా బాల్యంలో కొన్ని కీలక దశల్లో అధిక స్క్రీన్ ఎక్స్‌పోజర్ ఉంటే.. తర్వాతి సంవత్సరాల్లో విద్యా పనితీరు, వర్కింగ్ మెమరీ బలహీనపడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. ఫ్రాన్స్‌కు చెందిన INSERM, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం 'Growing Up in Singapore Towards Healthy Outcomes (GUSTO)' బర్త్ కోహార్ట్‌లోని 502 మంది పిల్లలపై జరిగింది. పిల్లలు వివిధ వయస్సుల్లో స్క్రీన్‌లను ఎంతసేపు ఉపయోగించారో పరిశీలించిన పరిశోధకులు.. వారి విద్యా పనితీరును 9 ఏళ్ల వయ స్సులో, జ్ఞాపకశక్తి సామర్థ్యాలను సుమారు 10.5 ఏళ్ల వయస్సు లో అంచనా వేశారు.



ఈ పరిశోధనలో ప్రత్యేకత ఏమిటంటే.. పిల్లలు మొత్తం ఎన్ని గంటలు స్క్రీన్ చూస్తున్నారు అనే అంశంతో పాటు, ఏ వయస్సులో స్క్రీన్ ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉంది? అనే అంశాన్ని కూడా పరిశీలించారు. ఆ విశ్లేషణలో చిన్న వయసులో, ముఖ్యంగా ఒక సంవత్సరం వయస్సులో ఎక్కువ స్క్రీన్ సమయం ఉన్న పిల్లల్లో తర్వాతి దశలో విద్యా పనితీరు తక్కువగా ఉండటం, వర్కింగ్ మెమరీ బలహీనంగా ఉండటం వంటి సంబంధాలు కనిపించాయి. సుమారు ఆరు సంవత్సరాల వయస్సులో అధిక స్క్రీన్ వినియోగం కూడా ప్రతికూల ఫలితాలతో సంబంధం ఉన్నట్లు సూచించింది.

# వెల్లుల్లితో ఆరోగ్యం

మనం రోజు తినే ఆహారంలో వెల్లుల్లి ఎంతో ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. ప్రతిరోజు తయారుచేసే కూరలో ఇది లేకపోతే రుచి కూడా ఉండదు. వెల్లుల్లి ప్రతిరోజు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉండగలుగుతుంది. బీపీ కంట్రోల్ కు వస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అయితే సాధారణ వెల్లుల్లి కంటే కాశ్మీర్ వెల్లుల్లి తీసుకోవడం వల్ల అధిక ప్రయోజనాలు ఉంటాయని కొందరు ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. సాధారణ వెల్లుల్లి నాలుగు లేదా ఐదు రెబ్బలు తీసుకుంటే.. కాశ్మీర్ వెల్లుల్లి మాత్రం రెండు రెబ్బలతో అత్యధిక ప్రయోజనాలను అందిస్తుంది. అసలు కాశ్మీర్ వెల్లుల్లిలో ఉండే పోషకాలు చూద్దాం.



కాశ్మీర్ వెల్లుల్లిని స్నో మౌంటెన్ గార్లిక్ అని కూడా అంటారు. ఇందులో అలిన్, అలిసిన్, ఎస్ అలైన్ సిస్టీన్, డైలైన్ సల్ఫైడ్స్, ఫ్లేవనాయిడ్స్ పినాల్స్, సెలీనియం, సాపొనిక్స్, సల్ఫర్ కంపాక్స్ వంటి ఔషధాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలును చేస్తాయి. సాధారణంగా వెల్లుల్లిలో అలిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలోకి వెళ్లేటప్పుడు అలిసిన్ గా మారిపోతుంది. అయితే అలిన్ నుంచి అలిసిన్ అనే పదార్థం ఎక్కువ మొత్తంలో ఉండడానికి వెల్లుల్లి తీసుకునే పద్ధతిని మార్చుకోవాలి.

చాలామంది వెల్లుల్లి నాలుగు లేదా ఐదు రెబ్బలను తీసుకుంటూ ఉంటారు. వీటిని చితక్కొట్టిన తర్వాత వెంటనే కూరలో వేస్తారు. అలా కాకుండా చితగ్గొట్టిన తర్వాత కనీసం 15 నిమిషాల పాటు నిల్వ ఉంచడం ద్వారా అలసిన్ అనే పదార్థం ఎక్కువ మొత్తంలో తయారవుతుంది. దీంతో సాధారణం కంటే ఎక్కువ పోషకాలు అందుతాయి. అలాగే చితక్కొట్టిన వెల్లుల్లిని నూనెలో వేయించకుండా.. ఆహారంలో చివరగా లేదా ఆహారంతో కలిపి నేరుగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల వెల్లుల్లిలో ఉండే ప్రయోజనాలు శరీరంలోకి వెళ్లి ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

అయితే సాధారణంగానే మార్కెట్లో దొరికే వెల్లుల్లితో ఈ రకమైన ప్రయోజనాలు ఉంటాయి. కానీ కాశ్మీర్ వెల్లుల్లితో ఇవి రెట్టింపు ఉంటాయి. ఉదాహరణకు సాధారణ వెల్లుల్లి నాలుగు లేదా ఐదు రెబ్బలు కంటే కాశ్మీర్ వెల్లుల్లిని కేవలం రెండు రెబ్బలు మాత్రమే తీసుకోవడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ అత్యధికంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని కొందరు చెబుతున్నారు. గుండె ఆరోగ్యానికి ఈ కాశ్మీర్ వెల్లుల్లి ఎంతో ప్రయోజనాకరంగా ఉంటుంది. చెడు కొలెస్ట్రాలను తగ్గించి మంచి కొలెస్ట్రాలను పెంచే విధంగా ఉపయోగపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచడానికి, శరీరంలో ప్రవేశించే వైరస్, బ్యాక్టీరియాను చంపేయడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. యాంటీ మైక్రోబియల్ ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. షుగర్ లెవెల్స్ తగ్గించడానికి కూడా ఇది ఎంతో సహకరిస్తుంది.

# నాన్నల్లోనూ కెమిస్ట్రీ

అమ్మతనం గురించి అందరూ చెప్పేవారే. అదే.. నాన్నతనం అంటే.. అదేంటని? అడిగేస్తారు. ప్రెగ్నెంట్ అయిన మహిళల్లో ఎలాంటి మార్పులు వస్తాయో.. తండ్రి కాబోతున్నానన్న ఆనందం పురుషుడిలోనూ బోలెడన్ని మార్పులు తీసుకొస్తాయి. ఇవన్నీ ఎప్పటి నుంచో జరుగుతున్నా.. తాజా పరిశోధనల్లో కొత్తగా కనుగొన్నారంతే. పురుషుల్లో నాన్నతనం ఎప్పుడు ఎలా వస్తుంది? దానికి హార్మోన్లు ఎంతటి కీలక భూమిక పోషిస్తాయన్న విషయాన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

భార్య ప్రెగ్నెంట్ అయ్యిందన్న వెంటనే తండ్రిలో మార్పు ఇట్టే వచ్చేస్తుంది. అప్పటివరకు ఉన్న అలవాట్లను మార్చేయటమే కాదు మగాడ్ని మరింత బాధ్యతాయుతంగా మార్చేస్తుంది. దంపతుల మధ్య ఉన్న మనస్పర్థల్ని సైతం తగ్గించేస్తుంది. ఇదంతా ఉత్తినే జరిగిపోదు. తండ్రి కాబోతున్న వేళ.. మగాళ్ల మెదళ్లలో చాలానే మార్పులు జరుగుతాయన్న విషయాన్ని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో వారికి తెలీకుండానే భార్య పట్ల.. రాబోయే బిడ్డ విషయంలో మరింత బాధ్యతాయుతమైన మానసిక స్థితికి చేరుకుంటున్నట్లుగా గుర్తించారు.

మనిషి మెదడులో తల్లిదండ్రులుగా వ్యవహరించే తీరుకు ఆలోపేరంటల్ సబ్ స్ట్రేట్ గా వ్యవహరిస్తారు. బిడ్డ పుట్టబోతున్న కబురు విన్నంతనే ఇది యాక్టివేట్ అవుతుంది. అమ్మ కాబోతున్న విషయం తెలిసినంతనే అమ్మాయిలో మార్పులు వచ్చినట్లే.. తండ్రి కాబోతున్నాననే భావన పురుషులను మార్చేస్తుంది. బిడ్డ సంరక్షణలో ఎక్కువగా పాలు పంచుకోవాలన్న భావన ఎంత ఎక్కువ ఉంటే.. ఆ మార్పు అంత ఎక్కువ అవుతుంది. దీనికి టెస్టోస్టిరాన్.. వాసోప్రిన్ లాంటి హార్మోన్లలో మార్పులు కూడా కారణం. ఈ కారణంగానే పురుషుల్లో అప్పటివరకు ఉండే దూకుడు స్వభావం తగ్గి.. ప్రశాంత చిత్తం పెరుగుతుంది.

పిల్లల్లేని పురుషుల కంటే తండ్రులవుతున్న వారిలో టెస్టోస్టిరాన్ తక్కువగా ఉంటుందన్న విషయాన్ని యూఎస్‌కు చెందిన నోట్రదామ్ వర్సిటీ అధ్యయనం గుర్తించగా.. ఈ కారణంగానే బిడ్డ పుట్టినంతనే ఆ శిశువుతో ఎక్కువగా మమేకం అవుతారన్న విషయాన్ని వెల్లడించింది. ఈ సమయంలో వారిలో ఆక్సోటోసిన్ స్థాయి విపరీతంగా పెరిగి.. తల్లి.. బిడ్డలపై మమకారం.. వారితో రిలేషన్ మరింత బలపడుతుంది. పలు అధ్యయనాల్లో తేలిందేమంటే.. ఆర్నెల్ల నుంచి రెండేళ్లలోపు వయసు ఉన్న పిల్లల తండ్రుల్లో ఆక్సిటోసిన్ స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటాయి. అప్పుడే పుట్టిన బిడ్డను అప్యాయంగా చూసుకునే.. చేతుల్లోకి తీసుకునే సమయంలో ఆ తండ్రుల్లో ప్రేమ హార్మోన్ వెల్లువలా ఉత్పత్తి అవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



పిల్లలతో ఎక్కువగా ఆడిపాడి.. వారితో మమేకం అయ్యే తండ్రుల్లో ఆక్సిటోసిన్ గణనీయంగా ఉంటుందని తేలింది. బాలింత తల్లుల్లోని చనుబాల ఉత్పత్తికి ప్రోలాక్టిన్ అనే రసాయనం కారణం. ఆసక్తి కలిగించే అంశం ఏమంటే తండ్రులు అయ్యే వేళలో.. తమ బిడ్డ కోసం ఆత్రుతగా ఎదురు చూసే పురుషుల్లో ఆ హార్మోన్ స్థాయి ఎక్కువగా ఉంటుందని గుర్తించారు. డాడ్ బ్రెయిన్ అనే పుస్తక రచయిత టీం తొలిసారి తండ్రులు అవుతున్న మగాళ్ల మెదళ్లను స్కాన్ చేసి పరిశీలించినప్పుడు.. వారి మెదళ్లలో నాడీ సంబంధిత మార్పులు చోటు చేసుకుంటున్నాయని.. కొత్త అనుభవాలకు సర్దుబాటు జరుగుతున్న వైనాన్ని గుర్తించారు. అందుకే అమ్మతనం మాత్రమే కాదు నాన్నతనం కూడా ఉంది బాస్.

### సమయపాలన పాటించండి

ఆధునిక జీవనశైలిలో సమయ పాలన లోపం అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతోందని నిపుణులు పేర్కొన్నారు. నిద్ర, ఆహారం, రోజువారీ కార్యకలా పాలకు నిర్దిష్ట సమయాలను పాటించడం ఆరోగ్యానికి ఉప యోగకరమని సూచించారు.



# గందరగోళంగా 'ఇందిరమ్మ ఇండ్ల' లాటరీ





### నిబంధనలు గాలికి.. లబ్ధిదారుల నిరసన

**ముద్ర, కూకట్‌పల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లాటరీ కార్యక్రమం అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా తీవ్ర గందరగోళానికి దారితీసింది. శనివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ డ్రా కార్యక్రమంలో అధికారులు నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ డివిజన్ పరిధిలో మొత్తం 9,326 దరఖాస్తులు రాగా, అధికారులు 5,976 మందిని అర్హులుగా గుర్తించారు. 480 ఇండ్ల కేటాయింపు కోసం హౌసింగ్ బోర్డ్ లైజనింగ్, భూసేకరణ అధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ బాబు, తహసిల్దార్ అశోక్ కుమార్ సమక్షంలో ఈ లాటరీ నిర్వహించారు. హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ గౌతమ్ కూడా ఈ కార్యక్రమాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.నిబంధనలు తుంగలో.. వెక్కిరింతగా లాటరీ!ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు 30 శాతం (125 ఇండ్లు) కేటాయించాల్సి ఉండగా, అధికారులు ఆ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకుండానే లాటరీ పూర్తి చేయడం గమనార్హం. అలాగే కేటగిరీల వారీగా చిట్టీలను విభజించి డ్రా తీయాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం వహించారు.

**మిశ్రమ చిట్టీలు –నిలిచిన డ్రా:**
ఎస్సీ కేటగిరి లాటరీ తీస్తున్న సమయంలో ఓబీసీలకు చెందిన చిట్టీలు బయటపడటంతో లబ్ధిదారులు వేదిక వద్దకు వెళ్లి అధికారులను నిలదీశారు. అధికారులు చేపట్టిన రీ–వెరిఫికేషన్‌లో ఎస్సీ కోటాలో 35 ఓబీసీ చిట్టీలు వచ్చినట్లు తేలింది. దీంతో డ్రా సుమారు గంటన్నర పాటు నిలిచిపోయింది.

**ఎస్సీ కేటగిరీపై వివక్ష**
తొలగించిన 35 చిట్టీలకు సంబంధించిన ఎస్సీ లబ్ధిదారుల రసీదులు ఏమయ్యాయని నిలదీసినా అధికారులు పట్టించుకోలేదు. అంతేకాకుండా 67 ఇండ్లకు లాటరీ తీయాల్సి ఉండగా 65 మాత్రమే తీసి, 67 పూర్తి చేసినట్లు ప్రకటించారు. మిగిలిన రెండు చిట్టీలు తీయాలని కోరినా లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి స్పందించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమైంది.

**కేటగిరీల విభజనలో లోపాలు:**
బీసీ, ఓబీసీలకు వేర్వేరుగా డ్రా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ మొత్తం కలిపి ఒకే కేటగిరీగా తీశారు. అవుట్‌సోర్సింగ్ కోటాలో 48 ఇండ్లు ఉండగా కేవలం 15 మందినే అర్హులుగా చూపి, మిగిలిన దరఖాస్తుదారులను కులాల కేటగిరీలో కలిపేశారు. దీనిపై ప్రశ్నించిన బాధితులకు "ఇది పైలట్ ప్రాజెక్ట్ మాత్రమే, తర్వాతి విడతలో చూద్దాం" అని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

**వెయిటింగ్ లిస్ట్ పై అస్పష్టత:**
120 మందితో కూడిన వెయిటింగ్ లిస్ట్‌ను కేటగిరీల వారీగా కాకుండా ఒకే జాబితాగా రూపొందించారు. దీనివల్ల ఏదైనా కేటగిరీ ఇల్లు రద్దయితే ఆ ఇల్లు ఎవరికి దక్కుతుందో తెలియని అయోమయం నెలకొంది.నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు స్వీకరించాలనే నిబంధనను కూడా అధికారులు పాటించలేదని, అర్హుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రా సందర్భంగా జరిగిన అనేక తప్పిదాలు, అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక బాధ్యతపై అవగాహన అవసరం

### సైబరాబాద్ సీపీ డా.ఎం.రమేశ్



**ముద్ర, శేరిలింగంపల్లి :** రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్. యం. డి. సీ మారతాన్ – 2026లో భాగంగా 5కే రన్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది. హెచ్ ఐ సి సి నుంచి హైటెక్స్ వరకు నిర్వహించిన ఈ పరుగు కార్యక్రమంలో సుమారు 6,100 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ రమేష్, ఐపీఎస్, సీఎంసీ కమిషనర్ సృజన, విద్యార్థులు, రన్నర్లు మరియు సామాన్య ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. క్రమం తప్పకుండా పరుగు, నడక వంటి శారీరక వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అదే విధంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు.పిల్లలు సెల్‌ఫోన్‌లకు ఎక్కువ సమయం కేటాయించకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకునేలా "సెల్‌ఫోన్ వద్దు – పుస్తకమే ముద్దు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. కథల పుస్తకాలు, ఇతర పుస్తకాలు, రాత సామగ్రిని అవసరమైన వారికి అందించడం ద్వారా పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి జ్ఞానాన్ని విస్తరించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యత, సమిష్టి భాగస్వామ్యం మరియు సేవాభావాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేశారు.సుమారు 6,100 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన రోహిణి ఫౌండేషన్ నిర్వాహకులు రన్నర్లు, విద్యార్థులు, ప్రజలు మరియు సైబరాబాద్ పోలీస్ సిబ్బందికి సైబరాబాద్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

## కంది సాగుతో రైతులకు ప్రయోజనం

### ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ముద్ర, చేవెళ్ళ:** కంది సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి రైతులకు సూచించారు. శనివారం షాబాద్ రైతు వేదికలో మిషన్ ఫర్ ఆత్మనిర్భర్త ఇన్ పల్సెస్–2026–27 పథకం కింద నిర్వహించిన కంది పంట క్లస్టర్ ఆధారిత ప్రదర్శన, శిక్షణ, ఇన్‌పుట్‌ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, టెక్నికల్ ఏడీఏ పద్మజ, చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు, కేవీకే హయత్‌నగర్ శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు. షాబాద్ మండలంలో ఎంపిక చేసిన ఏడు గ్రామా ల్లో 85 హెక్టార్ల విస్తీర్ణంలో కంది పంట క్లస్టర్ ఆధారిత బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్‌ను చేపట్టినట్లు తెలిపారు. నాణ్యమైన ధ్రువీకరించిన కంది విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించి, విత్తన శుద్ధి, సమగ్ర పోషక యాజమాన్యం, కలుపు నివారణ, పురుగు–తెగుళ్ల సమగ్ర యాజమాన్యం, సూక్ష్మ పోషకాల వినియోగం తదితర అంశాలపై రైతులకు సూచనలు ఇచ్చారు. అవసరమైన ఇన్‌పుట్‌లను పంపిణీ చేసి ప్రదర్శనా క్షేత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కంది సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చని సూచించారు. అంతారం గ్రామంలో పథకం కింద సాగు చేస్తున్న కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర, సర్పంచులు అశోక్, గోవర్ధన్ రెడ్డి, , పెంటయ్య, నవనీత స్వామి, సందీప్ గౌడ్, మహేందర్ గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

## నీట్ పీజీ అభ్యర్థిని ఆత్మహత్య

### ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో విషాదం



**ముద్ర, హైదరాబాద్:** నగరంలోని ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న కర్నూలుకు చెందిన యువతి యశ్విత ఆత్మహత్యకు పాల్పడింది.ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లోని అపరాజిత హాస్టల్‌లో ఉంటూ గత ఆరు నెలలుగా యశ్విత నీట్ పీజీకి సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. హాస్టల్‌లో విషం తీసుకున్న ఆమెను గుర్తించిన సిబ్బంది ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది.పరీక్షల ఒత్తిడి, మానసిక ఆందోళన కారణంగానే ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్‌రెడ్డి ఏకైక కుమార్తె యశ్వితగా సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేడియల్ కూడలితో నష్టం కలిగించవద్దు



**ముద్ర, చేవెళ్ళ:** రేడియల్ రోడ్డు కూడలి ఏర్పాటులో తమకు అన్యాయం చేయొద్దంటూ రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డుకు ఒకవైపు ఉన్న భూములను వదిలి మరోవైపు చిన్న, సన్నకారు రైతుల భూములను మాత్రమే సేకరించడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా సమానంగా భూమిని సేకరించి కూడలి ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్ వరకు ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డులో భాగంగా షాబాద్ మండలం సంకెపల్లిగూడ గ్రామం వద్ద కూడలి ఏర్పాటు చేసేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు సుమారు 46 ఎకరాల 21 గుంటల భూమిని సేకరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం భూముల సర్వే చేసేందుకు షాబాద్ తహసీల్దార్ అన్వర్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని సర్వేను అడ్డుకుని ఆందోళన చేపట్టారు.తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూముల్లో సర్వే ఎలా చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. కూడలి ఏర్పాటుకు 46 ఎకరాలకు పైగా భూమి సేకరించడం ఏంటని అన్నారు. రోడ్డుకు ఒకవైపు పెద్ద భూయజమానుల భూములు ఉన్నప్పటికీ వాటిని వదిలి, మరోవైపు ఉన్న చిన్న, సన్నకారు రైతుల భూములనే ఎక్కువగా సేకరించడం వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న భూమిలో ఎక్కువ భాగం రోడ్డు నిర్మాణంలోనే పోతుందని, కూడలి కోసం అదనంగా భూములు సేకరిస్తే తమ జీవనాధారం కోల్పోతామని పేర్కొన్నారు.రైతులకు అన్యాయం చేయొద్దుమధుసూదన్ రెడ్డిరైతుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని అధికారులతో మా ట్లాడారు. రేడియల్ రోడ్డు కూడలి ఏర్పాటులో రైతులకు అన్యాయం జరగ కుండా చూడాలని కోరారు. రోడ్డుకు ఇరువైపులా సమానంగా భూమిని సేకరించే విధంగా ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సూచించారు. కొంతమంది రైతులపైనే భూసేకరణ భారం పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. నివేదిక ఉన్నతాధికారులకురైతుల అభ్యంతరాలను పరిశీలించి సర్వే నిర్వహించి, పూర్తి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు. రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## తాండూర్ పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించండి



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూరు మున్సిపల్ పాలక వర్గం పూర్తిగా వైఫల్యం చెందిందని, 36 వార్డుల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్ పాల్గొన్నారు.శనివారం మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో చెత్త సేకరణ, తరలింపు పనులు సక్రమంగా జరగడం లేదని ఆయన అన్నారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన వాహనాలు, జేసీబీలు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోందని అన్నారు.సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్, శానిటేషన్ కాంట్రాక్టర్లు, సిబ్బంది వివరాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపల్ అధికార పాలక వర్గం పట్టణ అభివృద్ధిలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఒకరిపైన మరొకరు విమర్శించడం మానుకుని వార్డ్ అభివృద్ధిపై ప్రతిసారించాలని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నం చేయాలని, అధికారులు పాలనపై దృష్టి సారించకుంటే ప్రతి వార్డ్ ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాటం చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నయని హెచ్చరించారు.

## ముఖ్యమంత్రిపై ఎమ్మెల్యే పిచ్చి ప్రేలాపనలు చేస్తే సహించేది లేదు



**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నోరు అదుపులో పెట్టుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పిచ్చి ప్రేలాపనలు చేస్తే సహించేది లేదని కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌ఛార్జ్ బండి రమేష్ హెచ్చరించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. తెలంగాణలో గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టారని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ల కక్కుర్తితో 'కూలేశ్వరం'గా మారిందని ఎద్దేవా చేశారు. దీనిపై కేటీఆర్, హరీష్‌రావు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. మహానగర విస్తరణే ధ్యేయం'రైజింగ్ తెలంగాణ' పేరుతో సీఎం అద్భుత పాలన అందిస్తున్నారని, హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలబెట్టేందుకు గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఫోర్త్ సిటీ ఏర్పాటుతో మహానగరాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కేంద్రం సహకరించినా, లేకున్నా మెట్రో రెండో దశను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి పేదలకు అమ్ముకుని, అక్రమ ఆస్తులు సంపాదించడానికి ఎమ్మెల్యే కృష్ణారావు అలవాటుపడ్డారని బండి రమేష్ ఆరోపించారు. కౌన్సిలర్‌గా ఉన్నప్పటి నుండి ఎమ్మెల్యేగా గెలిచేనంత వరకు ఆయన ఆస్తులు విపరీతంగా పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌లోకి రావాలని ఎవరూ బతిమిలాడలేదని, కాంగ్రెస్ పార్టీలో చేరనందుకే తనపై కక్ష సాధిస్తున్నారన్న ఎమ్మెల్యే విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. సమావేశంలో నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ నియోజకవర్గయువతకు పోటీ పరీక్షలకు అండగా నిలిచేందుకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తనవంతుగా కృషి చేస్తున్నారని తాండూర్ పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతి, యువకులకు ఎస్సై కానిస్టేబుల్ మరియు ఇతర పోటీ పరీక్షల ప్రయత్నంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఉచిత కోచింగ్ తరగతులను నిర్వహించడం తాండూరు ప్రాంతంలోని యువతి, యువకులకు మెరుగైన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యేపై ఆరోపణలు ప్రజలెవరూ నమ్మరు

**ముద్ర, కూకట్‌పల్లి:** కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ ఎన్ని అబద్దాలు ప్రచారం చేసినా కూకట్‌పల్లి ప్రజలు నమ్మరని బీఆర్ఎస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ రెడ్డి సతీష్ ఆరోరా అన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై కబ్జా ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు.హైదర్‌నగర్, హస్మత్‌పేట భూములకు సంబంధించి కోర్టు తీర్పుల ఆధారంగానే ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. 1958 నుంచి ఆయా భూముల్లో జరిగిన లావాదేవీలు, కబ్జాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఒకవైపు 22ఏ భూములకు న్యాయం చేస్తామని చెబుతూ, మరోవైపు అవే భూములను కబ్జా భూములుగా పేర్కొనడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీలు మారిన బండి రమేష్‌కు మాధవరం కృష్ణారావును విమర్శించే స్థాయి లేదని రెడ్డి సతీష్ ఆరోరా మండిపడ్డారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సీఎండీలతో జాయింట్ సమావేశం జరిగింది. ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లకు సంబంధించిన ప్రధాన సమస్యలతో పాటు మొత్తం 14 డిమాండ్లపై సమావేశంలో సవివరంగా చర్చించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు, న్యాయమైన డిమాండ్లను జేఏసీ ప్రతినిధులు మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మేనేజ్‌మెంట్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.పెండింగ్ డిమాండ్లపై మరింత చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు 15 రోజుల్లో మరోసారి జాయింట్ సమావేశం నిర్వహించేందుకు మేనేజ్‌మెంట్ అంగీకరించింది.సమావేశంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, కో–కన్వీనర్ బీసీ రెడ్డి, కో–చైర్మన్లు మహేష్, వజీర్, ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి, కన్వీనర్ సాయులు పాల్గొన్నారు.అలాగే శ్యామ్ మనోహర్, రాంజీ, నెహ్రూ, స్వామి, సదానందం, వెంకటేశ్వరులు, అరవింద్, గోవర్ధన్, శ్రీధర్ గౌడ్, తిరుపతి, మురళి, పవన్, సత్యనారాయణ రావు, భూపాల్ రెడ్డి, తాజాదిన్, శ్రీనివాసరెడ్డి, ఇంద్రారెడ్డి తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు.

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన బండారు దత్తాత్రేయ

**ముద్ర, హైదరాబాద్:** హర్యానా మాజీ గవర్నర్, సీనియర్ నేత బండారు దత్తాత్రేయ శనివారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

## హరికృష్ణకు నివాళి



**ముద్ర, హైదరాబాద్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో స్వర్గీయ నందమూరి హరికృష్ణ గారి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు శ్రీ సామా భూపాల్ రెడ్డి గారు హరికృష్ణ గారి చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను స్మరించుకుంటూ సంతాప సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజునాయక్, కట్టా వెంకటేష్ గౌడ్, సంధ్యపోగు రాజశేఖర్, సుభాషిణి, స్వాతి, జగదీష్, అవ్వారు మోహన్, రమేష్ తదితరులు, అలాగే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 30.08.2026
www.mudranews.in | @mudranews



## యోగ, ప్రకృతి వైద్యాన్ని అలవర్చుకోండి

ఆరోగ్య పరిరక్షణలో యోగ, ప్రకృతి వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని కార్యక్రమంలో సూచించారు. జీవనశైలిలో సహజ పద్ధతులను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు వివరించారు.



## క్రీడలతోనే శారీరక, మానసిక దృఢత్వం

**అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు**




**ముద్ర, కరీంనగర్:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో శనివారం వివిధ రకాల క్రీడా పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించడంతో పాటు రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా అధిగమించే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే తత్వం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. హాకీ దిగ్గజం, 'హాకీ మాంత్రికుడు' మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వాలీబాల్, ఫుట్ బాల్, ఖో–ఖో, కబడ్డీ, హ్యాండ్ బాల్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ డంప్‌యార్డ్ తరలించాలి

**- తెలంగాణ రక్షణ సేన**




**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ డంప్‌యార్డ్‌ను వెంటనే నగరానికి దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ.. డంప్‌యార్డ్‌లో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, రోజుకు దాదాపు 150 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతుండటంతో దుర్వాసన, పొగ, దోమలు, కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.చెత్తను బయోమైనింగ్ ద్వారా తొలగించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, తడి–పొడి చెత్తను వేరు చేసి శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేయాలని డిమాండ్ చేశారు. డంప్‌యార్డ్ తరలింపు ప్రక్రియను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసి, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్య పరిష్కారం కోసం రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేపడతామని హరిప్రసాద్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మానకొండూరు నియోజకవర్గం ఇన్చార్జి చెన్నమల్ల చైతన్య, బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బాసవేణి రాజేందర్, ధీటి రమేష్, మడిపల్లి వినీత్, లింగంపల్లి శ్రీనివాస్, కొత్తూరు రఘు, ఎండి హుస్సేన్, నూతి సాయి చరణ్, ఎండి రజి, బి రాజు,విద్యాసాగర్, సూత్రాల రాజన్నా, అభిరామ్, పిన్నింటి సంగీతారెడ్డి, ఎండి సల్మా, పొన్నం శిరీష,జంగా అపర్ణ, కొలిపాక గౌతమి, కుతాడి రజిత, కుసుంబ మంజులా రెడ్డి, కొరిమి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## 22A సమస్య పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం

**- మాజీ మంత్రి హరీశ్ రావు**




**ముద్ర, పటాన్‌చెరు:** 22A నిషేధిత జాబితాలో చేర్చిన భూములు, ఇళ్లను వారం రోజుల్లో తొలగించకపోతే సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. శనివారం పటాన్ చెరువులో 22A భూముల బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 50,565 ఎకరాలు, లక్ష ఇళ్లు 22A జాబితాలో ఉన్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆస్తులను ఎలాంటి దరఖాస్తు లేకుండా జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే బాధిత రైతులు, ఇళ్ల యజమానులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించి వంటావార్పు చేపట్టి, సమస్య పరిష్కారమయ్యే వరకు అక్కడే బైఠాయిస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## గాంధీ భవన్‌లో ఓబీసీ కులగణనపై సమావేశం

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (TPCC) కార్యాలయం గాంధీ భవన్‌లో శనివారం OBC కులగణనపై సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రొఫెసర్ కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. TPCC OBC సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్లపల్లి శంకర్, ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, క్రమశిక్షణ కమిటీ కో–చైర్మన్ శ్యామ్ కుమార్, మాజీ మేయర్ రామ్మోహన్, రాజన్న సిరిసిల్ల జిల్లా DCC అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తో పాటు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, DCC అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం

**కరీంనగర్ కార్పొరేషన్ కొత్త కృత నిశ్చయం**






**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం శనివారం ప్రశాంతమైన, సుహృద్భావ వాతావరణంలో జరిగింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు. అజెండాలోని అన్ని అంశాలపై సభ్యులు చర్చించి సభ ఆమోదం తెలిపారు.

సమావేశంలో ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలను కార్పొరేటర్లు మేయర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ప్రజారోగ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది.

ప్రజల నుంచి వస్తున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ నగర సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సభ్యులు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. కరీంనగర్ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వం, సహకారంతో నగరానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉన్న పథకాలు, నిధులను సమర్థవంతంగా వినియోగించుకొని నగర మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని మేయర్ పేర్కొన్నారు. కరీంనగర్‌ను పరిశుభ్రమైన, సుందరమైన, ఆధునిక మౌలిక వసతులతో కూడిన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అడిషనల్ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కూలిన ఇంటి పైభాగం..



**- తప్పిన ప్రాణాపాయం...**

**ముద్ర చిగురుమామిడి** :శిథిలావస్థలో ఉన్న పాత ఇల్లు పైకప్పు భాగం కూలి పెను ప్రమాదం తప్పింన సంఘటన శనివారం ఉదయం నవాబుపేటలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని రామయ్య ఉదయం దాదాపు 5 గంటల సమయంలో నిద్ర లేచి బయటకు వెళ్లే సమయంలో తన ఇంటి పైకప్పు భాగం ప్రమాదవశత్తు కూలిపోయిందని ఆ శబ్దానికి ఒక్కసారిగా నిద్రలో నుంచి మేల్కొని కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తమ పక్కనే ఇంటి పైకప్పు భాగం కూలి పడడంతో భయభ్రాంతులకు గురై ఉలిక్కిపడ్డామని ఆ సమయంలో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఇంటి లోపల నుండి పరుగు పరుగున బయటికి పరిగెత్తామన్నారు.ఎన్నో ఏళ్ల నుండి మట్టి గోడలు కుమ్మరి పెంక,పాలిథిన్ కవర్లతో కప్పబడి తమ ఇల్లు శిథిలావస్థలో ఉందని ప్రతి వర్షాకాలం సీజన్లో గోడలు తడుస్తూ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో తామున్నామన్నారు.గతంలో అధికారులకు సమాచారం అందించినా ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నా కానీ తమకు ఇల్లు మంజూరు చేయలేదని బాధితుడు రామయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.రెవెన్యూ అధికారులకు,గ్రామ సర్పంచ్ కు సమాచారం అందించగా జిపిఓ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని కూలిపోయిన ఇల్లును పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ప్రస్తుతం ఇల్లు పై కప్పు కూలడంతో నిరాశ్రయులుగా ఉన్న తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తాం..

**అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు..**
**దట్నూర్ లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి..**



**ముద్ర, గొల్లపల్లి న్యూస్ :** జగిత్యాల జిల్లాలో మిగిలిపోయిన అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రపంచం కొనియాడిన మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేద ప్రజల సంక్షేమం జరిగిందని, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనతో దేశంలో ఇందిరమ్మ వాడలు లేని గ్రామాలు లేవని మంత్రి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం సంక్షేమ శాఖకు బాకీ ఉన్న రూ. 100 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలతో సంక్షేమ హాస్టళ్లలో 10వ తరగతి విద్యార్థులకు 99% ఉత్తీర్ణత సాధించారని మంత్రి వివరించారు.

ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు ఉన్నత విద్య చదువుకోవడానికి విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి ధర్మపురి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ధర్మపురిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని మంత్రి వివరించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువకులు రాణించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

ధర్మపురి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంది నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. దట్నూరు గ్రామంలో బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెక్కం గంగారాం, గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్, జగిత్యాల జిల్లా మాజీ గంధ్రాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, అంబేద్కర్ సంఘ జిల్లా అధ్యక్షులు హనుమాడ్లు, గొల్లపల్లి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ క్రీడతో శారీరక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

**- అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** ఆధునిక కాలంలో సైక్లింగ్ క్రీడకు ఆదరణ పెరుగుతోందని, ఈ క్రీడ వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ హానరరీ చైర్మన్ డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన "రన్ అండ్ రైడ్" కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాభిమానులు, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు కనీసం 45 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అన్ని వయస్సుల వారు సైక్లింగ్ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో సైక్లింగ్ క్రీడ పట్ల అవగాహన పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత సైకిల్ తొక్కడం తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అతి త్వరలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైక్లింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నెగ్గి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమం కోర్టు వద్ద ప్రారంభమై ఆర్ అండ్ బి చౌరస్తా, తెలంగాణ చౌక్, మంకమ్మ తోట, రాంనగర్, టెలీ–ఫోన్ క్వార్టర్స్ మీదుగా డ్యామ్ కట్టపై చేరి గేట్ల వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ మిట్టపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ మేకల అరవింద్ బాబు, లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, సైక్లిస్ట్ అఖిల్, లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సఫలం అయ్యారు.

## వరి సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన

**ముద్ర, చిగురుమామిడి:** మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఆత్మ–ఆర్‌పీఎల్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో ఆధునిక పద్ధతులు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మ పీడీ చత్రు నాయక్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించే ఏడు రకాల సన్న వంగడాలపై వివరించారు. శాస్త్రీయ సాగు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. బీజేఆర్ అగ్రికల్చర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, శాస్త్రవేత్త హరికృష్ణ పంట దశల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని,మండల వ్యవసాయ శాఖ అధికారి పున్నం చందర్ రెడ్డి,ఏటీఎం అర్చన,వ్యవసాయ విస్తరణ అధికారులు,చిగురుమామిడి మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 30.08.2026
www.mudranews.in | @mudranews



### చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వండి



రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకోవాలని సూచించారు. వీటిని తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వివరించారు.

# ఏడాదిలో ప్రతి అంగుళం సర్వే

**వివాదరహిత భూములన్నింటికీ పట్టాలు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**ముద్ర, సూర్యాపేట:** రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నింటినీ ప్రతి అంగుళం సర్వే చేసి, నిజమైన భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 15 గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూములకు పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తాతల కాలం నుంచి పరిష్కారం కాని భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు.భూ కబ్జాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములను పరిరక్షిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది కాలంలో ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, వివాదరహిత భూములన్నింటికీ పట్టాలు ఇస్తామని పునరుద్ఘాటించారు.గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు ఇప్పటివరకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, వచ్చే రెండున్నరేళ్లలోనూ అదే స్థాయిలో రుణాలు ఇస్తామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

**రైతుకు భూమి హక్కే ధైర్యం**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలకు పట్టాల పంపిణీతో పరిష్కారం లభిస్తోందన్నారు. భూమిపై హక్కు ఉంటే రైతుకు ధైర్యం వస్తుందని, రైతుబంధు, రైతు భరోసా, రైతు బీమా, రుణాలు తదితర ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.100 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు నిర్మిస్తామని వెల్లడించారు. గుడిసె లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. పట్టాల పంపిణీతో ఏళ్లుగా పరిష్కారం కాని రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ సుమారు 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు లేక రైతులు ఇబ్బందులు పడ్డారని, పట్టాల పంపిణీతో వారికి భూ హక్కులు లభించాయని అన్నారు.1,044 ఎకరాలకు పట్టాలుజిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ భూ హక్కులు లేక రైతులు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని చెప్పారు.నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 3,000 ఎకరాలకు పైగా భూములను సర్వే చేసి, రైతుల పొలాల వద్దకు వెళ్లి నోటీసులు ఇచ్చిన అనంతరం ముసాయిదా జాబితాను ప్రకటించామని తెలిపారు. ప్రస్తుతం 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఖాతాలు లేని రైతులకు కొత్తగా ఖాతాలు, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

## ఎల్నినో నష్టాల నుంచి రైతులను ఆదుకోవాలి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 29 :** ఎలీనో ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి రామకృష్ణ భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా వర్షాభావం వల్ల వరి, పత్తి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల వైపు మళ్లిన రైతులకు సైతం నష్టం వాటిల్లిందని, వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం యూరియా సరిపడా అందక, యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ ఆలస్యమై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సొసైటీల ద్వారా పూర్తిస్థాయిలో యూరియాను పంపిణీ చేయాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని ప్రభుత్వ విద్యా, వైద్య సంస్థలతో పాటు రేషన్ షాపుల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వేలో తేలిన స్థానిక సమస్యల్లో కొన్నింటిని అధికారులు పరిష్కరించగా, మిగిలిన ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్టు వెల్లడించారు. ఈ ధర్నా కార్యక్రమానికి విద్యార్థులు, యువత, ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణ వెంకటేశ్వరరావు, వై. విక్రమ్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, మడుపల్లి గోపాల్ రావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడలు వంచైనా ఫీజు బకాయిలు సాధిస్తాం

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్ట్ 29 :** విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ, పెండింగ్‌లో ఉన్న రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఖమ్మం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద 'ఫీజుల బకాయి—బీజేపీ లడాయి' పేరుతో నిరసన దీక్ష చేపట్టింది.జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శాసనాల సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల హక్కు అని, సకాలంలో నిధులు విడుదల కాక పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థుల ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు.రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు చేపట్టిన ఈ ఉద్యమాన్ని బకాయిలు చెల్లించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్యాచరణ ప్రకటించకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో పార్టీ నేతలు సన్నె ఉదయ్ ప్రతాప్, నున్నా రవికుమార్, శ్యాంసుందర్ నాయక్, గుత్తా వెంకటేశ్వర్లు, మందా సరస్వతి పాల్గొన్నారు.

## మండల ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం కమిటీ



**ముద్ర, తుంగతుర్తి:** ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ పిలుపు మేరకు తుంగతుర్తి మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలగిరిలో శనివారం ప్రాథమికోన్నత స్థాయి ఆంగ్ల సముదాయ సమావేశంలో భాగంగా సమావేశమైన ఆంగ్ల ఉపాధ్యాయులు ఏకగ్రీవం గా కమిటీని ఏర్పాటు చేశారు.అధ్యక్షురాలిగా శ్రీమతి ఉప్పు కృష్ణవేణి, ఉపాధ్యక్షుడిగా ఎం. సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా అలకుంట్ల యాకన్న, సంయుక్త కార్యదర్శులుగా రవికుమార్ బాబు, ఎలిజబెత్, కోశాధికారిగా అనురాధ, జిల్లా మండలి సభ్యులుగా సుగుణ, బాలోజి ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

## ధ్యాన్‌చంద్ జీవితం యువతకు గొప్ప ప్రేరణ




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం ప్రతి యువకుడికి ఒక గొప్ప ప్రేరణ కావాలని కష్టపడి పనిచేస్తే, లక్ష్యంపై దృష్టి పెడితే, ఎన్ని అడ్డంకులు ఎదురైనా విజయం సాధించవచ్చని ఎస్.సి కార్పొరేషన్ ఈ.డీ జినుకల శ్యామ్ సుందర్, జిల్లా యువజన, క్రీడాల అధికారి కే. ధనంజనేయులు అన్నారు. శనివారం ఇండోర్ స్టేడియంలో జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.జి ఎఫ్ సెక్రెటరీ ధాశరథ రెడ్డి, పీడీలు రఘువీర్ సింగ్, రమేష్ రెడ్డి , ఐలయ్య, నాతి కృష్ణమూర్తి, రమణ, గోపాల్, డి.సి.ఓ నాగార్జున, ఠాకూర్ కాంబాట్ అకాడమీ కిక్ బాక్సింగ్ కోచ్ చెన్న రాజేష్, కార్యాలయ సిబ్బంది జానకిరాములు, మురళి, జయ, రేణుక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహా సభల పోస్టర్ ఆవిష్కరణ




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర 3వ మహాసభలను జయ ప్రదం చేయాలని కోరుతూ భువనగిరిలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను దేశభక్తిని లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను పాదుకొల్పడానికి అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సెప్టెంబర్ 8, 9 10 తేదీలలో విద్యా వైద్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే యువజన ప్రదర్శన బహిరంగ సభను, రాష్ట్ర 3వ మహాసభలను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐవైఎఫ్ నాయకులు వడ్ల ఆకాష్, జానా చింటూ, గీస సాయి పాల్గొన్నారు.

## బిజెపిని గద్దె దించితేనే దేశానికి భద్రత

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 29 :** బిజెపిని అధికారంలో నుంచి దించడం ద్వారానే దేశానికి భవిష్యత్తు ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన సిపిఐ, ప్రజా సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రజలను కులమతాల పేరిట విభజిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ల మేలు కోసమే పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశ సంపదను కొద్దిమందికే దారాదత్తం చేస్తున్న బిజెపి విధానాలకు నిరసనగా సిపిఐ 'బద్లావ్ జరూరీ హై'




పేరుతో ఉద్యమం చేపట్టిందని, ఇందులో భాగంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ మహా ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నింగిని తాకిన నిత్యావసరాల ధరలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 29 :** దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతుండటంతో సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందని తెలంగాణ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. గిరిప్రసాద్ భవన్లో బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన మహిళా సమాఖ్య జిల్లా సమితి సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి పాలనలో సంక్షేమ పథకాలకు కోత విధిస్తూ సంపన్న వర్గాలకే లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలో సిపిఐ నిర్వహించే ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని




పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే రూ. 2,500 హామీని నెరవేర్చలేదని, కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల అమలుపై నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య నాయకులు పోటు కళావతి, సీతామహాలక్ష్మి , తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లికి బోనాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని బార్వేట్ , ఎల్బీనగర్ లో భువనగిరి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సిద్ధంకి కోటయ్య ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లికి అంగరంగ వైభవంగా డబ్బు చప్పులతో బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవంలో భువనగిరి పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్ ముదిరాజ్, ముదిరాజ్ నాయకులు కోలుపుల కమలాకర్, కూర వెంకటేష్, మాటూరు అశోక్, కొలుపుల నాగరాజు, కూర శ్రీనివాస్, ఎనబోయిన చంద్రశేఖర్, కొలుపుల కిష్టయ్య, పలపటి శ్రీనివాస్, తుపాకుల అనిల్, సైదులు, శ్రీకాంత్, సూరి, ముదిరాజ్ బంధువులు ప్రజలు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ను అభివృద్ధి చేయాలి

**ముద్ర, మోత్కూరు:** డంపింగ్ యార్డు ను వెంటనే అభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య అన్నారు. శనివారం పట్టణం లోని డంపింగ్ యార్డ్ ను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో కలిసి సందర్శించారు. పట్టణములో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ లో తడి పొడి చెత్తలుగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో ఎరువు తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్ పర్సన్ పల్లెర్ల వెంకన్న , కౌన్సిలర్లు కుర్మిల్లా ప్రమీల, సుల్తాన్ స్వామి, కొండా శోభ, మొగుళ్ళ అనురాధ, గనగని శైలజ, పన్నాల విద్య,బీసు శ్రీకాంత్,నల్ల మధు, కారుపోతుల వెంకన్న, మెంట రమణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 29 :** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపడుతున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాధనాన్ని పారదర్శకంగా వినియోగిస్తూ ప్రజలకు సుదీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. పనుల నిర్వహణలో ఎలాంటి రాజీ పడకూడదని, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించినప్పుడే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. విశాలమైన రహదారులు, సక్రమమైన మురుగునీటి వ్యవస్థల ద్వారా నగర అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, శుభ్రమైన వాతావరణం వల్ల ఆరోగ్యం మెరుగుపడి వైద్య ఖర్చులు తగ్గుతాయని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పలువురు మునిసిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతనకల్ సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**ముద్ర, మోత్కూర్:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆదేశాల అనుసారం మోత్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో నూతనకల్ మండల కేంద్రంలోని స్టేడియం సభా స్థలం నూతనకల్ వద్ద రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధి గిరిజన, వికలాంగుల సంక్షేమ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు తో కలిసి జరిగే సీలింగ్ భూముల రైతులకు భూమి పట్టాలు పంపిణీ చేసే సభా కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో పిఏసీఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, అనాజీపురం సర్పంచ్ బీసు వెంకన్న గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు, పాటిమట్ల, రాగిబావి,సదర్శపూర్ దాచారం గ్రామ శాఖ అధ్యక్షులు చిరుమర్తి యాదయ్య, గంట వెంకటరెడ్డి, సూరారం నవీన్ పాల్గొన్నారు.

## కౌన్సిల్ సమావేశం

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి నల్గొండ వెళ్లే రోడ్డులో బీటీ రోడ్డు నిర్మించుటకు, ప్రస్తుతం పాత బస్టాండ్ లో ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వారాంతపు సంతను ఇంతకుముందు లాగే అంగడి బజారుకు మార్చాలని, చిరు వ్యాపారుల నుండి తై బజార్ వసూలు చేయుట గురించి తదితర అంశములపై కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా 10 అంశాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో



మునిసిపల్ కమీషనర్ గోల్కొండ నర్సయ్య,వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న,కౌన్సిలర్లు కుర్మిల్లా ప్రమీల, సుల్తాన్ స్వామి, కొండా శోభ, మొగుళ్ళ అనురాధ, గనగని శైలజ, పన్నాల విద్య, బీసు శ్రీకాంత్, నల్ల మధు, కారుపోతుల వెంకన్న, మెంట రమణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 30.08.2026
www.mudranews.in | @mudranews



**ప్రకృతి నియమాలకు అనుగుణంగా జీవించండి**



జీవన విధానాన్ని ప్రకృతి నియమాలకు అనుగుణంగా మార్చుకోవాలని డా. మంతెన సత్యనారాయణ రాజు సూచించారు. సూర్యోదయం, సూర్యాస్తమయాలను అనుసరించి రోజువారీ కార్యక్రమాలను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు.

# తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు తప్పనిసరి

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పితే సహించేది లేదు**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**ముద్ర, సూర్యాపేట:** తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పే విధానాన్ని సహించేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. భూ సంబంధిత దరఖాస్తులను సానుకూల దృక్పథంతో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు.దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. చట్ట నిబంధనలను పాటిస్తూనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా పనిచేయాలని అన్నారు.45 దరఖాస్తులు పెండింగ్‌పై ఆగ్రహంయాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్‌లో భూములకు సంబంధించిన 45 దరఖాస్తులు ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని మంత్రి ప్రస్తావించారు. దీనిపై సంబంధిత తహసీల్దార్‌ను వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడం సరికాదని, ప్రతి దరఖాస్తుకు అధికారి బాధ్యత వహించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రజలను అనవసరంగా తిప్పుకోవడం, అవసరం లేని పత్రాలు అడగడం, చిన్న సమస్యలకు కూడా రోజుల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. కార్యాలయానికి వచ్చిన వ్యక్తి సంతృప్తితో తిరిగి వెళ్లేలా అధికారులు పనిచేయాలని సూచించారు.అక్టోబర్ చివరి నాటికి రీ–సర్వే పూర్తితొలి విడతలో చేపట్టిన 70 గ్రామాల రీ–సర్వేను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారిస్తూ పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.సర్వే పూర్తయిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో ఇతర మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు. విధులకు హాజరుకాని లైసెన్స్డ్ సర్వేయర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించాలిఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలోని ఎల్–1, ఎల్–2, ఎల్–3 సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. 15 రోజుల్లో ఎల్–3 సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. తొలి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను దసరాలోపు పూర్తి చేయాలని ఆదేశించారు.గతంలో నిర్మాణం నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గుర్తించి 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఇంటి పట్టాల పంపిణీ వేగవంతం చేయాలిగతంలో ఇంటి పట్టాల కోసం భూములు గుర్తించినప్పటికీ పంపిణీ చేయని వాటిని వెంటనే గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను చట్టబద్ధంగా శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు.ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

**సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య**



ముద్ర మోత్కూర్: అడ్డగూడూరు మండల పరిధి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోటమర్తి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవ అధికార సంస్థ (ఎం ఎల్ ఎస్ సి) రామన్నపేట ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ నేటి బాలలే భవిష్యత్తు దేశ సంపదని బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత అని అన్నారు. మరియు 1098,100, 108, 112, తదితర టోల్ ఫ్రీ నెంబర్ల గురించి అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం సీనియర్ అడ్వకేట్లు డేవిడ్, ప్యానల్ అడ్వకేట్లు కూనూరు శ్రీనివాస్ లు మాట్లాడుతూవిద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు వాహన చట్టాలు, పోక్సో,గంజాయి పై, అలాగే గుడ్ టచ్, బాడ్ టచ్, మానసిక , శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన పద్ధతులు , మెలకువలు మెదలగు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. బాల్య వివాహాల నిర్మూలన కొరకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పై అవగాహన కల్పించడం జరిగింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందర్ల రాజ్య వర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి అగ్రి లీగలైడ్ క్లినిక్ కే శ్రీశైలం, లీగల్ సర్వీస్ ప్రతినిధి కురిమేటి యాదయ్య, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ వాసం విష్ణువర్ధన్ రావు, ఏ ఏ పి సి చైర్మెన్ చిత్తలూరి సరిత, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీలు , మండల పరిధి పోలీసు అధికారులు, గ్రామపంచాయతీ కార్యవర్గం,పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నందగోకుల్–చెల్మెడ కమాన్ వరకు

# బీటీ రోడ్డు నిర్మించాలి

**మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** నిజాంపేట మండలం నందగోకుల్–చెల్మెడ కమాన్ మధ్య రహదారి అధ్వానంగా మారడంతో ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం పాదయాత్ర చేపట్టారు. నందగోకుల్ హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. నందగోకుల్ నుండి ప్రారంభమైన పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ... రహదారి సక్రమంగా లేకపోవడంతో వాహన దారులు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారి ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందన్నారు. ప్రజల ఇబ్బందులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నందగోకుల్ నుంచి చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఎన్నిసార్లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.రహదారి నిర్మాణం కోసం పద్మా దేవేందర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు అనూహ్య రీతిలో భారీ జనస్పందన లభించింది. నందగోకుల్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రహదారి నిర్మాణం కోసం ప్రజలు ఇంత భారీగా స్వచ్ఛందంగా తరలివచ్చి తమ సమస్యను ప్రభుత్వానికి తెలియజేస్తున్నారని చెప్పారు. ఇంతటి జనస్పందన చూసైనా ప్రభుత్వం, అధికారులు కళ్ళు తెరవాలని ఆమె సూచించారు. పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాదయాత్రలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షులు లావణ్య రెడ్డి, కౌన్సిలర్లు మామిళ్ళ ఆంజనేయులు, జుబేర్,, జీవన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆంజనేయస్వామి అయ్యప్ప దేవాలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రముఖ పురోహితులు పాల గణపతి శర్మ అభిషేకం, అలంకరణ నిర్వహించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు శనివారం నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూర్ చంద్రమౌళి మాట్లాడుతూ తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసా పారాయణం చాలా శక్తివంతమైందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఆచరిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అతి బలవంతుడైన హనుమంతుడు మనతో ఉంటాడని సూచించారు. భూత ప్రేత పిశాచాలు భయాలు శని వంటివి దరిచేరవని అన్నారు. పారాయణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు సత్యనారాయణ, నేలంటి వెంకటేశ్వర్లు, తడకమల్ల శ్రీనివాస్, మల్లికార్జున్, భాస్కర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కుంభం శివ గౌడ్, సత్తయ్య, వెంకటేశ్వర్లు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థో సదరం క్యాంప్ ప్రారంభం



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇకపై ఆర్థోపెడిక్ సదరం క్యాంప్‌ను నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఈ క్యాంప్ అందుబాటులోకి రానుంది. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ పిడి శేఖర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రవి ప్రకాష్ కోరారు. సదరం క్యాంప్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు డీఆర్‌డీఓ పిడి శేఖర్ రెడ్డి శనివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. క్యాంప్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు.వారానికి రెండు రోజులు క్యాంప్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రతి వారం మంగళవారం, శుక్రవారం రోజుల్లో ఆర్థోపెడిక్ సదరం క్యాంప్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 1న ప్రారంభోత్సవం సదరం క్యాంప్, అదనపు డయాలసిస్ పడకలు, అంబులెన్స్ సేవలను సెప్టెంబర్ 1వ తేదీన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్, ఆర్‌టీఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.దేవరకొండ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావడంతో పాటు, సదరం ధ్రువీకరణ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగనున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం



**5కే, 2కే రన్ ప్రారంభించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇయిస్తుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు చౌరస్తా నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు పురుషులకు ఐదు కిలోమీటర్ల రన్నింగ్, కొత్త బస్టాండ్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు బాలికలకు రెండు కిలోమీటర్ల రన్ కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడలలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడ లభిస్తాయి అన్నారు.అనంతరం ధ్యాన్చంద్ చౌరస్తా వద్ద ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్ అహ్మద్ , స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శివ, డీఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ సీఐ మహేష్, పాల్గొని ధ్యాన్చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించారు. విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి మధుసూదన్,సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం, ఫుట్బాల్ కోచ్ వినయ్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించాలి

**జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.గణేశ్వర్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** విద్యార్థుల్లో శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఆర్.బి. గణేశ్వర్ సూచించారు. మెదక్ జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, బాలల సంరక్షణ అధికారుల కోసం నల్సా పథకం 2024పై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని డైట్ కళాశాలలో నిర్వహించారు. డ్రగ్ దుర్వినియోగం, ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక, శారీరక ఆరోగ్యం, విద్యార్థులలో లింగ సమానత్వ ప్రవర్తనను అభివృద్ధి చేయడం పిల్లల రక్షణ అధికారుల పాత్రపై మాట్లాడారు.విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడటం వల్ల వారి శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతిని ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుంది. జ్ఞాపకశక్తి తగ్గడం, చదువుపై ఏకాగ్రత లేకపోవడం, తరగతులకు హాజరు కాకపోవడం, పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం, చదువు మధ్యలోనే ఆగిపోవడం, నిరాశ, నిస్పృహలు పెరగడం, శారీరక పరిస్థితి మరింత దిగజారడం, ఆకలి వుడకపోవడం, నిరంతరం మత్తులో వుండడం, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలు తీవ్రంగా దెబ్బతినడం జరుగుతుందన్నారు. మానసిక సమస్యలతో బాధపడే వారికి 24 గంటలూ టెలి మానస్ టోల్–ఫ్రీ నంబర్ 14416 లేదా 1800–891–4416 ద్వారా నిపుణులైన డాక్టర్లచే సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, డి ఎస్ఓ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:**మెదక్ జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్యం లక్ష్యం – పాక్స్ ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంన నిర్వహించారు. ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..సహకార శాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వల పథకం ద్వారా కింద మన జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం స్థాయిలో ధాన్య నిల్వ గోదాముల నిర్మాణం, భూ కేటాయింపు చేపట్టాలన్నారు. లక్ష్యాన్ని సాధించే దిశగా జిల్లాలోని అనువైన పాక్స్ లను గుర్తించి గోదాముల నిర్మాణం చేపట్టాలని సమావేశంలో చర్చించారు. పలు ప్రతిపాదనలు పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా సహకార అధికారి పద్మ, అడిషనల్ డిఆర్డీఓ సరస్వతి, జెడ్పీ సిఈఓ ఎల్లయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు

**ముద్ర, తుర్కపల్లి:** తుర్కపల్లి మండల కేంద్రంలో శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ పద్ధతిలో బోనాలను సమర్పించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. సర్పంచ్ సోమల్ల వెంకటేష్,



ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, వార్డు సభ్యులు అరవింద్, సోమల కరుణాకర్, బండారు రవి, కోట జాన్సన్, తరణి సుమని శ్రీహరి, గుండబోయిన కవితా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహన దారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



**ముద్ర, మోత్కూర్:** వాహన దారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా డి టి ఓ నరేష్ సంగెం తెలిపారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో శ్రీ లక్ష్మి మోటార్స్ నిర్వాహకులకు రాష్ట్ర స్థాయి బెస్ట్ స్కూటర్ సేల్స్ అవార్డు వచ్చిన సందర్భంగా హీరో డెస్టిని కస్టమర్ మీట్ ను శనివారం షోరూం లో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిటీఓ నరేష్ మాట్లాడుతూ శ్రీ లక్ష్మి మోటార్స్ నిర్వాహకులకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడం పట్ల వారిని అభినందించారు. డి టి ఓ, మున్సిపల్ పాలక వర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్త, కౌన్సిలర్ లు కూర్మిళ్ల ప్రమీల రాములు,సుల్తాన్ స్వామి, కొండా శోభ సోంమల్లు, మొగుళ్ల అనురాధ శ్రీనివాస్ రెడ్డి, గనగాని శైలజ నర్సయ్య, బీసు శ్రీకాంత్ గౌడ్, నల్ల మధు, కారుపోతుల వెంకన్న గౌడ్, మెంట రమణ నాగేష్, శ్రీ లక్ష్మి మోటార్స్ నిర్వాహకులు మెట్టు మంగేష్, మెట్టు గణేష్, నాగలక్ష్మి, శ్రీ లత,వాహన దారులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింత చెట్టు తండా గ్రామ శివారులో ఓ క్రషర్ మిల్లు పొదల పక్కన సుమారు 45 నుండి 50 సంవత్సరాలు మధ్య ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతదేహం కాళ్లకు నలుపు రంగు చెప్పులు ధరించి ఉన్నాడని మృతదేహంపై డబ్బాల గీతల చొక్కా ఎరుపు రంగు తువాల మృతదేహం పక్కన కవర్ లో దుప్పటి ఉందని ఇట్టి మృతుడు అందాజా ఐదు నుండి ఆరు రోజుల క్రిందర చనిపోయి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. చింత చెట్టు తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు. ఇట్టి మనిషి ఆచూకీ తెలిసినవారు కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ నంబర్లపై 8712670226, 8712670157 సమాచారం తెలపాలన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555